## డీఆర్డీవో అభివృద్ధి చేసిన బరాక్ మిస్సైల్ సిస్టమ్ వాడుతున్న ఇజ్రాయిల్

టెల్ అవివ్: ఇజ్రాయిల్‌పై ఇరాన్ మిస్సైళ్లతో దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఆ దాడుల్ని తిప్పికొట్టేందుకు బరాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఇజ్రాయిల్ వినియోగిస్తున్నది. మానవరహిత ఏరియల్ వాహనాలతో పాటు మిస్సైళ్లను కూడా ఆ బరాక్ సిస్టమ్ సమర్థవంతంగా అడ్డుకుంటోంది. ఇజ్రాయిల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్‌తో పాటు భారత్‌కు చెందిన డీఆర్డీవో కూడా ఆ సిస్టమ్ అభివృద్ధిలో పాత్ర పంచుకున్నది. ఇద్దరూ సంయుక్తంగా బరాక్ సిస్టమ్‌ను డెవలప్ చేశారు. వైమానిక ముప్పులను ఎదుర్కొనేందుకు దీన్ని తయారు చేశారు. యూఏవీలు, క్రూయిజ్ మిస్సైళ్లతో పాటు ఎయిర్‌బోర్న్ టార్గెట్లను బరాక్ సిస్టమ్ ఎదుర్కోగలదు. బరాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఓ అత్యాధునిక వ్యవస్థ. షార్ట్ టు మీడియం రేంజ్ మిస్సైల్ డిఫెన్స్ వ్యవస్థను ఇజ్రాయిల్ డెవలప్ చేసింది. నౌకలను రక్షించుకునేందుకు దీన్ని అభివృద్ధి చేశారు. రేడార్ ద్వారా సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ ను ఆ సిస్టమ్ రిలీజ్ చేస్తుంది. ఒకేసారి మల్టిపుల్ టార్గెట్లను అడ్డుకునే సామర్థ్యం బరాక్ సిస్టమ్‌కు ఉన్నది. బరాక్-8 మిస్సైల్ సిస్టమ్‌ను ఎంఆర్-సామ్ అని కూడా పిలుస్తారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :103 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 22-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## పాక్ నీటి కొరతకు సిద్ధంగా ఉండాలి..



న్యూఢిల్లీ, సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఈ ఒప్పంద నిబంధనలను పదేపదే ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా భారత నీటిని వాడుక చేసిందని, ఇకపై ఆ దేశం నీటి కొరతకు ఎదురుకావాల్సిందేనని హెచ్చరించారు. ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఒప్పందాలను తులతూలకుండా రద్దు చేయలేమని, కానీ సింధూ ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు మాత్రం భారత్‌కు ఉంది. అదే చేశామని అని వివరించారు. 1960లో కుదిరిన ఈ ఒప్పందం శాంతి, పురోగతి లక్ష్యాలతో ఏర్పడిందని, అయితే పాకిస్థాన్ నిబంధనలు ఉల్లంఘించిన వేళ భారత నిర్ణయం తగినదేనని పేర్కొన్నారు. భారతదేశానికి హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కెనాల్ నిర్మాణం ద్వారా పాకిస్థాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తామని, పాకిస్థాన్ అన్యాయంగా ఉపయోగించుకున్న నీటి ప్రవాహం ఇక ఆ దేశానికి అందదని అని షా చెప్పారు. పాకిస్థాన్ వ్యవసాయం, నీటి వనరులు అత్యధికంగా సింధూ నదులపై ఆధారపడిన నేపథ్యంలో, భారత్ తీసుకున్న తాజా నిర్ణయం ఆ దేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. 80 శాతం వ్యవసాయ నీరు ఈ ఒప్పందం ద్వారానే లభించేది. పాక్ జీడీపీలో సింధూ జలాల వాటా 25 శాతమని చూస్తే, భారత్ తాజా విధానం ఆర్థికంగా ఎంతగానో ప్రభావం చూపనుందని అర్థమవుతుంది. ఈ సందర్భంగా అమిత్ షా, నియోజకవర్గాల పునర్విభజనపై కూడా మాట్లాడారు. "ఇందుకు ఎవరూ ఫిర్యాదు చేసే పరిస్థితి లేదు. సమతుల్యతతో ప్రక్రియ కొనసాగుతుంది. 2026లో తమిళనాడులో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో డీఎంకే ఈ అంశాన్ని వ్యతిరేకిస్తోంది," అని ఆయన విమర్శించారు. అలాగే, మహిళా రిజర్వేషన్ల విషయాన్ని ప్రస్తావిస్తూ, "2029లో జరగబోయే లోక్‌సభ ఎన్నికలు మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తోనే జరగబోతున్నాయి," అని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు.

## 'ట్రంప్ నిజంగా నోబెల్ శాంతి బహుమతికి అర్హుడు'..



వాషింగ్టన్,ప్రపంచవ్యాప్తంగా అనేక రంగాలలో యుద్ధాలను ఆపడంలో తాను ముఖ్యమైన పాత్ర పోషించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇంతలో, పాకిస్తాన్ ప్రభుత్వం 2026 నోబెల్ శాంతి బహుమతికి ట్రంప్ పేరును అధికారికంగా ప్రతిపాదించింది. 2025లో భారతదేశం, పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధ సమయంలో ట్రంప్ తీసుకున్న నిర్ణయాత్మక దౌత్య జోక్యం, మధ్యవర్తిత్వం కారణంగా ఆయన పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించాలని నిర్ణయించినట్లు పాకిస్తాన్ ఒక ప్రకటనలో తెలిపింది.భారతదేశంతో కాల్పుల విరమణ తీసుకురావడంలో ట్రంప్ జోక్యాన్ని పాకిస్తాన్ ప్రశంసించింది. ట్రంప్ ప్రయత్నాల కారణంగా కాల్పుల విరమణ సాధ్యమైందని, పెద్ద యుద్ధ ముప్పును నివారించగలిగామని ఆ ప్రకటన పేర్కొంది. దీనివల్ల రెండు అణ్వాయుధ శక్తుల మధ్య యుద్ధం జరిగే అవకాశం తప్పిందని పేర్కొంది. ఈ అవార్డుకు ఆయన నిజంగా అర్హుడని తెలిపింది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కు ప్రతిస్పందనగా ఇస్లామాబాద్ ఆపరేషన్ బన్యన్ ఉన్ మార్సూస్ ను ప్రారంభించిందని పాకిస్తాన్ తెలిపింది. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను వేగంగా పెంచింది. కానీ ట్రంప్ జోక్యం ఈ ప్రాంతంలో ఉద్రిక్తతను తగ్గించడంలో సహాయపడింది. ఈ జోక్యం ట్రంప్ శాంతి స్థాపకుడిగా పాత్రకు రుజువు. చర్చల ద్వారా ఈ వివాదాన్ని ముగించాలనే ఆయన నిబద్ధతకు కూడా ఇది రుజువు.అయితే, నోబెల్ శాంతి బహుమతి రాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నైరాశ్యం వ్యక్తంచేశారు. విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో కలిసి, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, రిపబ్లిక్ ఆఫ్ రువాండా మధ్య ఒక ఒప్పందాన్ని కుదిర్చామని మీకు చెప్పడానికి నేను సంతోషంగా ఉన్నానని ట్రంప్ సోషల్ మీడియా పోస్ట్‌లో వెల్లడించారు. ఈ రెండింటి మధ్య యుద్ధం దశాబ్దాలుగా రక్తపాతానికి ప్రసిద్ధి చెందింది. ఇది ఆఫ్రికాకు, ప్రపంచానికి కూడా గొప్ప రోజు. కానీ దీనికి నాకు నోబెల్ శాంతి బహుమతి లభించదని అన్నాడు. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధాన్ని ఆపినందుకు నాకు నోబెల్ బహుమతి రాదని ఆయన అన్నారు. సెర్బియా, కొసావో మధ్య యుద్ధాన్ని ఆపినందుకు నాకు నోబెల్ బహుమతి రాదని, ఈజిప్ట్, ఇథియోపియా మధ్య శాంతిని పునరుద్ధరించినందుకు నాకు నోబెల్ బహుమతి రాదని అన్నారు.

## రాజకీయ దురుద్దేశంతోనే కౌశిక్ రెడ్డి అరెస్ట్



హైదరాబాద్: ప్రజల తరపున ప్రశ్నిస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని రాజకీయ దురుద్దేశంతోనే అరెస్టు చేశారని మండలిలో బీఆర్ఎస్ పార్టీ పక్ష నేత మధుసూధనా చారి విమర్శించారు. కౌశిక్ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఆయనపై ఎన్నో అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే శని,ఆదివారాలు కోర్టుకు సెలువు రోజులని చూసి కౌశిక్ రెడ్డిని అరెస్టు చేసిందన్నారు. రెండు రోజులైనా జైల్లో పెట్టాలని కుట్ర చేశారని విమర్శించారు. అక్రమ కేసులను న్యాయ పోరాటం ద్వారా ఎదుర్కొంటామని చెప్పారు.కోర్టుల్లో వరస ఎదురు దెబ్బలు తగిలినా నవ్విపోదురు గాక నాకేమిటీ సిగ్గు అనే రీతిలో ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు.హామీల అమలు చేతకాక అక్రమ అరెస్టులకు దిగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కృష్ణుడు కూడా శిశుపాలుడి వంద తప్పులను భరించారని, వరసగా తప్పులు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తప్పనిసరిగా ప్రజల చేతిలో శిక్ష తప్పదన్నారు. కౌశిక్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. కేంద్ర మంత్రికి నోటీసులు ఇవ్వడానికి సిద్ధమైన సిట్

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి నోటీసులు ఇచ్చేందుకు సిట్ అధికారులు సిద్ధమైయ్యారు.(జూన్ 20) సాయంత్రం కేంద్ర మంత్రికి ఫోన్ చేసిన సిట్.. మీ ఫోన్ ట్యాప్ అయ్యిందని వెల్లడించారు. విచారణకు సిద్ధంగా ఉండాలని పోలీసులు కోరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి వాంగ్మూలం తీసుకునేందుకు సమయం అడిగారు. అయితే, షెడ్యూల్ చూసుకుని టైం చెబుతానని ఆయన తెలిపారు. రేపో మాపో సిట్ నోటీసులు జారీ చేయనుంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తొలుత తెరపైకి తీసుకొచ్చిన నేత బండి సంజయ్.. కేసీఆర్ పాలనలో ఫోన్లను ట్యాప్ చేస్తున్నారంటూ పలుమార్లు ఆరోపించారు. కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది, ప్రధాన అనుచరుల ఫోన్లను ట్యాప్ చేశారని బండి సంజయ్ పేర్కొన్నారు. ఇక, కేసీఆర్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో అనేక ఉద్యమాలు, ఆందోళన కార్యక్రమాలను బండి సంజయ్ నిర్వహించారు. బీజేపీ కార్యక్రమాలను భగ్నం చేసేందుకు బండి సంజయ్ తో పాటు కుటుంబ సభ్యుల, వ్యక్తిగత సిబ్బంది ఫోన్లను గత్ సర్కార్ ట్యాపింగ్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సమాచారం తెలుసుకుని అర్ధరాత్రి సంజయ్ నివాసంపై దాడి చేసి టెన్త్ పేపర్ లీక్ పేరుతో అరెస్ట్ చేశారు పోలీసులు. కరీంనగర్ ఎంపీ ఆఫీసులో 317 జీవో సవరణ దీక్ష జరగకుండా నిలువరించేందుకు అనేక విధాలుగా ప్రయత్నించి భంగపడ్డారు. రాజకీయంగా ఎదుర్కొలేక ఫోన్ ట్యాపింగ్ తో తనను దెబ్బతీసేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని పలుమార్లు బహిరంగ సభల్లో, మీడియా వేదికల ద్వారా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ఆరోపించారు. భార్యాభర్తల మధ్య సంభాషణలను కూడా ట్యాప్ చేసి నీచానికి ఒడిగట్టిందన్నారు. బండి సంజయ్ చెప్పిందంతా నిజమేనని సిట్ వర్గాలు తెలియజేస్తున్నాయి. వందలాది మంది ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు నిర్ధారణ చేసింది. సాక్షిగా బండి సంజయ్ వాంగ్మూలం తీసుకునేందుకు సిద్ధమైంది.



## గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ : శనివారం తెల్లవారుజామున గచ్చిబౌలి స్టేడియం లో ఘనంగా అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఆయుష్, ఆరోగ్యశాఖ ఘనంగా నిర్వహించాయి. ఈ అధికారిక కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, స్పోర్ట్స్ మినిస్టర్ వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు ఇతర ప్రముఖులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే 5వేల మంది విద్యార్థులు, యువకులు, యోగా సాధకులు ఈ యోగా డే కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేశారు.

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం.. మంత్రి దామోదర రాజనర్సింహ**

హైదరాబాద్, ప్రతి రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహఅన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో యోగా డే వేడుకలను ఆయుష్, ఆరోగ్యశాఖ సంయుక్తంగా శనివారం ఘనంగా నిర్వహించాయి. ఈ అధికారిక కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, స్పోర్ట్స్ మినిస్టర్ వాకిటి శ్రీహరి , స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు ఇతర ప్రముఖులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఐదు వేల మంది విద్యార్థులు, యువకులు, యోగా సాధకులు పాల్గొని యోగాసనాలు వేశారు.

**ప్రపంచానికి భారత దేశం అందించిన గొప్ప వరం**

ప్రపంచానికి భారతదేశం అందించిన గొప్ప వరం యోగా అని మంత్రి రాజనర్సింహ అన్నారు. ప్రపంచానికి ఈ వరాన్ని అందించిన గురువు, మహర్షి పతంజలి ని ఈ సందర్భంగా మనందరం స్మరించుకోవాలని అన్నారు. పతంజలి అందించిన అష్టాంగ యోగ విద్యలే, ప్రస్తుత యోగాకు ప్రాణాధారమని, యోగా అనేది కేవలం వ్యాయామానికి సంబంధించినది కాదని శరీరం, మనసు, ఆత్మను ఏకం చేసే అద్భుతమైన సాధనమని వివరించారు. ప్రస్తుతమున్న ఉరుకుల పరుగుల జీవన శైలితో బీపీ, షుగర్, కేన్సర్లు, కిడ్నీ సమస్యలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని, కోట్లు సంపాదించే వారికి కూడా ప్రశాంతత ఉండడం లేదని, ఇటువంటి సమస్యలన్నింటికీ యోగా చక్కని పరిష్కార మార్గం చూపుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**630 యోగా గురువుల నియమించిన ప్రభుత్వం**

యోగాను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 630 మంది యోగా గురువులను నియమించినట్లు, మరో 264 మంది యోగా గురువుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి తెలిపారు. హెల్త్ సబ్‌సెంటర్లలో రోజూ ఉదయం యోగా క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది కాలంలో కొత్తగా ఐదు లక్షల మందికి యోగా నేర్పించామన్నారు. అన్ని విద్యా సంస్థల్లో యోగా నేర్పించేలా ప్రోత్సహిస్తున్నామని, నేచురోపతి, యోగిక్ సైన్సెస్‌లో పీజీ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల ద్వారా ప్రజలకు యోగాను చేరువ చేస్తామని హామీ ఇచ్చారు.

## ఒలింపిక్స్ లో యోగాను చేర్చాలి .. చంద్రబాబు




విశాఖపట్నం : యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించడమే కాకుండా.. వివిధ దేశాల్లో యోగాను ఆచరిస్తున్నారని సీఎం చంద్రబాబు చెప్పారు. సెప్టెంబర్‌లో యోగా సూపర్ లీగ్ ప్రారంభం కానుండడం ఆనందంగా ఉందన్నారు. యోగాను ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్ క్రీడలలో చేర్చేలా ప్రధాని మోడీ చొరవ చూపాలని కోరుకుంటున్నానన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖ సాగర తీరంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాని మోదీ పాల్గొన్న ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ . ప్రధానమంత్రి దార్శనికత, గత పదేళ్లుగా యోగాను ప్రోత్సహిం చడం వల్ల, యోగా ఇప్పుడు ఉద్యమంగా మారిందన్నారు. చరిత్ర సృష్టించాలన్నా.. రికార్డులు బ్రేక్ చేయాలన్నా ప్రధాని మోడీకే సాధ్యమని కొనియాడారు. యోగా మన జీవితంలో భాగం కావాలన్న సీఎం చంద్రబాబు.. ప్రజలు ప్రతిరోజూ ఒక గంట యోగా కోసం సమయం కేటాయించాలని సూచించారు. డిజిటల్ ప్రపంచంలో క్రమశిక్షణ, సృజనాత్మకత వంటి అంశాలు పెంచుకోవడం చాలా అవసరమన్నారు. దీనికి కూడా యోగా ఉపకరిస్తుందన్నారు. యోగా సాధన మానసిక, శారీరక ఆరోగ్యానికి మార్గం చూపుతుందని ముఖ్యమంత్రి అన్నారు. "దేశం, ప్రాంతం, మతం, భాషతో సంబంధం లేకుండా యోగాకు ఆమోదం లభించింది. శరీరం, మనస్సు, ఆత్మలను కలిపేందుకు యోగానే మార్గం. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుంది. ఒత్తిడిని అధిగమించవచ్చు, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు." అని చంద్రబాబు తెలిపారు. యోగా అంతర్జాతీయ స్థాయికి చేరడానికి ప్రధాని నరేంద్ర మోడీ కారణమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని కల్పించి, విశాఖకు వచ్చి యోగా డేలో పాల్గొన్న ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు ప్రతిజ్ఞ.. యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ ప్రారంభం




హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రంలో మాదకద్రవ్యాలపై పోరుకు ఒక ముఖ్యమైన అడుగు వేయడంతో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ వీక్ వేడుకలు ప్రారంభమయ్యాయి. జూన్ 21 నుండి 26 వరకు జరగనున్న ఈ వారోత్సవాలను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.రాష్ట్ర డీజీపీ జితేందర్ ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, TGANB డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇతర అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థులు, ప్రముఖులు పాల్గొన్నారు. విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడమే ఈ వారోత్సవ లక్ష్యం.TGANB డైరెక్టర్ సందీప్ శాండిల్య విద్యార్థులతో ప్రత్యేకంగా యాంటీ డ్రగ్ సోల్జర్‌గా ప్రమాణం చేయించారు. "మాదకద్రవ్యాల జోలికి వెళ్లం, డ్రగ్స్ వ్యతిరేకంగా పని చేస్తాం" అని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా హరిచందన మాట్లాడుతూ, "సే నో టు డ్రగ్స్ అనే నినాదం ప్రతి ఒక్కరిదాకా చేరేలా చూడాలి" అని పిలుపునిచ్చారు.డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. "డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ" కోసం ప్రభుత్వం, పోలీస్ విభాగం కృతనిశ్చయంతో పని చేస్తున్నాయని స్పష్టం చేశారు. "డ్రగ్స్ మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పూర్తిగా నాశనం చేస్తాయి. యువత డ్రగ్స్ పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదు. విద్యార్థులే సమాజ మార్పు కారకులు" అన్నారు.విద్యార్థులే తమ జీవితం అనే పుస్తకాన్ని మంచి విషయాలతో తమను తాము పూర్తిగా రాయాలని సూచించారు. "ఒక విద్యార్థి కనీసం పది మందికి 'సే నో టు డ్రగ్స్' అనే సందేశాన్ని అందించాలి" అని సూచించారు.ఈ వారోత్సవాల్లో పాఠశాలలు, కళాశాలల స్థాయిలో డ్రగ్స్ పై అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రతిజ్ఞ సంఘటనలు, సోషల్ మీడియా ప్రచారాలు నిర్వహించనున్నారు. "పాఠశాలల్లో ఎక్కడైనా నార్కోటిక్ పదార్థాలు ఉంటే, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని అధికారులు సూచించారు.డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంతో ప్రారంభమైన ఈ అవగాహన వారోత్సవం యువతలో కొత్త చైతన్యం నింపనుంది. ప్రభుత్వ, పోలీస్, విద్యా సంస్థల కృషితో తెలంగాణను డ్రగ్స్ నుంచి విముక్తి చేయడం ఇప్పుడు అందరి కల.

## ఆ ముగ్గురు ఉద్యోగులను తొలగించండి.. ఎయిర్ ఇండియాకు డీజీసీఏ కీలక ఆదేశాలు



అహ్మదాబాద్: గత గురువారం గుజరాత్‌లో ఘోర విమాన ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో బిల్డింగ్‌పై కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. భద్రతా లోపానికి కారణమైన ముగ్గురు ఉద్యోగులను తొలగించాలని ఎయిర్ ఇండియాను ఆదేశించింది. ఈ విషయాన్ని సంబంధిత వర్గాలు శనివారం వెల్లడించాయి. ఆ ముగ్గురు అధికారుల్లో ఎయిర్‌లైన్ డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ కూడా ఉన్నట్లు తెలిసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం ఎయిర్‌పోర్ట్ కు సమీపంలోని ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిన విషయం తెలిసిందే.విమానం కూలిన అనంతరం 1,000 డిగ్రీల ఉష్ణోగ్రతతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.ఈ దుర్ఘటలో మొత్తం 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. ఇక ఈ ఘటనలో మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో డీఎన్ఏ పరీక్ష ద్వారా మృతదేహాలను గుర్తిస్తున్నారు.

## సంపాదకీయం

**ఆదివారం 22-06-2025**

# ఆరోగ్య ప్రదాయిని యోగా !

నవ్వించడం యోగం..నవ్వకపోవడం రోగం అన్నారు. నవ్వుకూడా ఓ ఆరోగ్య ప్రక్రియ అని అందరూ తెలుసుకోవాలి. ఇకపోతే యోగా అన్నది భారతీయ జీవన విధానంలో ఉన్న ప్రాచీన ప్రక్రియ. ఇది శాస్త్రీయంగా రుజువు చేయబడింది. యోగాను పరిచయం చేసిన మనదేశం..ఇప్పుడు అంతర్జాతీయ యోగాను కూడా జరుపుకునేలా చేసింది. మనావులు ఎక్కడ ఉన్నా, ఏ స్థితితలో ఉన్నా యోగా వల్ల అనేకానేక రుగ్మతలను నిర్మూలించవచ్చు. యోగాతో శరీరం క్రమపద్ధతిలో మార్పు చెందడమే గాకుండా, జీర్ణప్రక్రియయతో పాటు, నాడీ వ్యవస్థను అదుపులో ఉంచుతుంది.. ఓ రకంగా చెప్పాలంటే యోగా అలవర్చుకున్న వారికి వారి శరీరం చెప్పినట్లుగా నడుచుకుంటుంది. విజ్ఞానశాస్త్ర ప్రకారం యోగా అంటేపరిపూర్ణ జీవనసార విధానం. భారతదేశం చేసిన ప్రయత్నంతో ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగగా దినోత్సవంగా గుర్తించింది. దీంతో యోగాకు ప్రాధాన్యంతో పాటు, అంతర్జాతీ యంగా దీనిని ఆచరించే వారి సంఖ్య పెరిగింది. యోగా అనేది 5వేల సంవత్సరాల నుండి భారతదేశంలో ఉన్న జ్ఞానం యొక్కఅంతర్భాగంగా గుర్తించారు. యోగా చేస్తున్న వారిలో మానసిక, ఆరోగ్య సమస్యలు ఉండవని నిరూపితం అయ్యింది. నిత్యం యోగా చేసిన వారు ఆనందంగాను, ఉత్సాహంగానూ ఉండడాన్ని గమనించ వచ్చు. యోగ సూత్రాలను సరళంగా, వివరంగా, అందరికి అందుబాటులోనికి తీసుకురావటమే లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అత్యంత లాభాన్ని నిజజీవితంలో ఎలా అనుభవించగలం అన్న అంశం మీద ఇది కేంద్రీకృతమై ఉంటుంది. ఆరోగ్య సమస్యలు గాని, భావావేశాలు గాని, వ్యక్తిగత జీవితం పైన ప్రభావాన్ని చూపుతుంటాయి. అలాంటి వారు యోగా సాధన ద్వారా ఉపశమనం పొందవచ్చని నిరూపింతం అయ్యింది. జీవన సరళిలో చిన్న చిన్న మార్పులతో సమస్యలని సహజంగానే అధిగామించడం సాధ్యమనికూడా తెలుసుకోవచ్చు. నిత్యంయోగా చేస్తూ ఆనందమయ జీవితం పొందడానికి ప్రతి ఒక్కరూ కనీసం ఓ అరగంటయినా కేటాయిస్తే మంచి ఫలితం దక్కవచ్చు. ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నంగా భావించాలి. యోగాతో మనస్సు, శరీరం అదుపులో ఉంటుందని కూడా నిరూపితం అయ్యింది. ఇది వేల ఏళ్లుగా ఈ ప్రక్రియ సాగుతోంది. అందుకే ఐక్యరాజ్యసమితి మన వినతిని గుర్తించి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించింది. జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం ఆరోజు ఉత్తరార్ధ గోళంలో అత్యధిక పగటి సమయం కావడమే. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపుపొందడంతో అదేరోజును అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. యోగా దినోత్సవం అందుబాటులోకి వచ్చాక దీనిని ఓ కార్యక్రమంగగా కాకుండా నిరంతర ప్రక్రియగా ఆచరించడం మొదల య్యింది. అనేక దేశాలు, దీనిని ఆరోగ్యంలో భాగంగా అమలు చేస్తున్నాయి. ముస్లిం దేశాలు సైతం దీని ప్రాధాన్యాన్ని గుర్తించాయి. దీర్ఘకాలిక రోగాలను సైతం అదుపు చేసే అవకాశం యోగా ద్వారా లభించగలదు. చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామము, కేవలం కొన్ని శారీరిక కదలికలు ,ఇంకా శ్వాస పక్రియ అని మాత్రమే అనుకుంటారు. నిజానికి మానవుని అనంత మైన మేధాశక్తి , ఆత్మశక్తిల కలయికగా నిరూపితం అయ్యింది. మానవుల ఆరోగ్యాన్ని,శరీరాన్ని, మనసును అదుపులో పెట్టుకునేలా రూపొందించిన అద్భుత ప్రక్రియ యోగ. ఇది ఎంతో ప్రాచీన కాలం నాటిది. రుషుల సాధనతో యోగా ప్రక్రియను రూపొందించారు. ఇది ప్రపంచానికి భారతదేశం అందించిన మహత్తర ప్రక్రియ. యోగాతో మనిషి శరీరం, మనస్సు, ఆరోగ్యం అదుపులో ఉండగలవు. దీనిలోజ్ఞాన యోగము (తత్వశాస్త్రము ), భక్తి యోగము , రాజ యోగం మరియు కర్మ యోగములు ఉన్నాయి. యోగాసనాలు అంటే రాజయోగ పక్రియలో పైన చెప్పిన యోగాలన్నిటిలో సమతౌల్యాన్ని , ఏకత్వాన్ని తీసుకువస్తాయి. యోగా అనేది ఆరోగ్యకరమైన శక్తిని పుంజుకునే ఆనందకర మైన అనుభూతి. ఇది సులభమైన, కష్టతర మైన శ్వాసపక్రియతో కూడుకున్నటువంటి పక్రియ. దీనిద్వారా శారీరక , మానసిక సమతౌల్యం ఏర్పడు తుంది. ఇది ఒక బహుముఖ ప్రజ్ఞానాన్నికలిగించే కార్యక్రమం. ఇందులో యోగాసనాలు, శ్వాస పక్రియ, యోగాకి సంబంధించిన జ్ఞానము. ఇంకా ధ్యానము పొందుపరుచబడి ఉంటాయి. శరీరం సౌష్టవంగా ఉండేందకు కూడా యోగా ఉపయోగపడుతుందిం. ఇది నేర్చుకునే విద్యార్థులకు తమను తాము ఇంటి వద్ద నే చేసుకోవచ్చు. ఇది క్రోతగా నేర్చుకునేవారికి,రోజు సాధన చేసుకునేవారికీ అన్నిరకముల వయసుల వారికి ఉపయోగ పడుతుంది. చేసేవారి జీవన విధానములో ఎన్నో గొప్ప మార్పులు చోటుచేసుకున్నాయి. దీర్ఘ కాలికమైన అనారోగ్యాల నుండి బయట పడ్డారు. నెర్చుకునే వ్యక్తులు వారి అనుభూతులని వివవరించారు. వారు ఎంతో సంతోషంగా, ఆతురత తగ్గి,ఓర్పు పెరిగి,కుశల బుద్ధి కలిగి, పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. యోగాలో ఉన్న అద్భుత మేమంటే యోగాసనాలు శరీరానికి ధృడత్వాన్ని, శక్తిని ఇస్తాయి. అందుకే పెద్దవారైన, చిన్నవారైన, ధృడంగాఉన్నవారైన,లేనివారైన ఆసనాలు వేయడానికి ఇష్టపడతారు. సాధన చేస్తున్న కొద్ది ఆసనాల వెనకాల ఉన్న అంతరార్థం బాగా అవగాహనకు వస్తుంది. ఆసనంలో ఉంటూనే బాహ్యా కరమైన శారీరక క్రమం నుంచి అంతరంగిక పరివక్రుత అనుభూతిలోకి వస్తుంది. యోగ ద్వారా గర్భిణుల ఆరోగ్యం కుదుట పడి, టెన్షన్‌ల నుంచి బటపడుతున్న తీరు చూస్తున్నాం. అలాగే ఎన్నోరకాల మానసిక రుగ్మతలకు యోగా ద్వారా పరిష్కారం దక్కుతోంది. యోగ మన జీవితంలోని అంతర్భాగమే. యోగ అనేది ఒక్కొక్క రకంగా అర్థమవుతుంది. యోగాలో ప్రధానమైనది ప్రాణాయామం. అనగా ఒకరి శ్వాస మీద పట్టు సాధించడం. ఇంకా శ్వాసను పీల్చే శక్తిని పెంచడం. సరైన శ్వాస పక్రియ శరీరంలోని అధిక ప్రాణవాయువును రక్తంలోనికి, మెదడులోనికి ప్రసరింపచేసి ప్రనసక్తిని పెంపొందిస్తుంది. ప్రాణాయామం అనేక యోగాసనాలు వేయటంలో దోహదపడుతుంది. ఈ రెండింటి సమ్మేళనము ప్రాణాయామం. యోగాసనాలు శరీరానికి మనస్సుకు స్వచ్ఛతను, వ్యక్తిగత అనుసాసనాన్ని ఇస్తాయి. ప్రాణాయామం మెళకువ మనలను లోతైన లేదా ఘాఢమైన ధ్యానములోనికి తీసుకువెళుతుంది. అందుకే విధిగా అంతా యోగాను అలవాటు చేసుకుంటే ఉత్తమమైన జీవన విధానం అలవడుతుంది.

# ప్రధాని మోడీ దౌత్యచాతుర్యం



న్యూఢిల్లీ,కొన్ని నెలల నిశ్శబ్దం తరువాత ప్రధాని నరేంద్ర మోడీ కెనడాలో జి7 దేశాల సదస్సులో తన దౌత్య చాకచక్యాన్ని ప్రదర్శించి భారత్‌కు అనుకూలంగా రెండు అంశాలను తిరిగి సరిచేయగలిగారు. మొదటిది భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య సయోధ్య తానే కుదిర్చి కాల్పుల విరమణ చేయించానని ట్రంప్ చేస్తున్న ప్రచారానికి అడ్డుకట్ట వేయగలిగారు. రెండోది గత రెండేళ్లుగా భారత్ కెనడా దేశాల మధ్య దౌత్యసంబంధాల్లో ఏర్పడిన ప్రతిష్టంభనకు ముగింపు పలికారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జి7 సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం నాడు ట్రంప్‌తో దాదాపు 35 నిమిషాల పాటు ఫోన్‌లో సంభాషించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిణామాల నేపథ్యంలో జాతీయ భద్రతా మండలి సమావేశంలో పాల్గొనడానికి ఒక రోజు ముందుగానే ట్రంప్ కననిస్కిస్ నుండి అమెరికాకు వెళ్లిపోయారు. దీంతో మోడీ ట్రంప్ ముఖాముఖీగా కలుసుకుని చర్చించే అవకాశం లేకపోయింది. దాంతో మోడీ ఆయనతో టెలిఫోన్‌లో సంభాషించవలసి వచ్చిందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మే 710 తేదీల్లో పాకిస్తాన్ భారత్ మధ్య జరిగిన పరిణామాలే వారిమధ్య సంభాషణల్లో చోటు చేసుకున్నాయని మిస్రీ తెలిపారు. భారత్ పాకిస్తాన్ కాల్పుల విరమణ (%ఙుఎఅఙఅ ఎఙంవ టఅతీవ%) లో మూడో వ్యక్తి మధ్యవర్తిత్వం ఏదీ లేదని, అలాగే ఇందులో వాణిజ్య ఒప్పందాల ప్రభావం కూడా లేదని, ఉభయ దేశాల మిలిటరీ నాయకత్వాల మధ్య అంగీకారం కుదిరిందని ట్రంప్‌కు మోడీ వివరించారు. పాకిస్తాన్ అభ్యర్థించడం వల్లనే భారత్ కాల్పులను ఆపగలిగిందని మోడీ వివరించారు. ఇక యుద్ధం ఆపకపోతే మీతో వాణిజ్యం ఆపేస్తానని భారత్‌ను ట్రంప్ బెదిరించారని వచ్చిన వార్తలపై కూడా మోడీ ట్రంప్‌నకు స్పష్టతనిచ్చారు. ఇదంతా విన్నాక ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ సాగిస్తున్న పోరుకు ట్రంప్ మద్దతు పలికారు. ఈ పర్యవసానాల ఫలితంగానే ఇన్నాళ్లూ భారత్ పాకిస్తాన్ మధ్య తానే శాంతి ఒప్పందం కుదిర్చి, యుద్ధం ఆపగలిగానని బాహాటంగా చెప్పకొచ్చిన ట్రంప్ ఇప్పుడు ఆ రెండు దేశాలే తమకు తాము ఒప్పందం కుదుర్చుకున్నాయని, ఇందులో తన మధ్యవర్తిత్వం ఏదీ లేదని ప్రకటించడం గమనార్హం. ఈ టెలిఫోన్ సంభాషణలో చివర్లో మోడీని ట్రంప్ అమెరికాకు ఆహ్వానించారు. కెనడాలో జి7 శిఖరాగ్ర సదస్సు ముగిశాక తిరుగు ప్రయాణంలో అమెరికాకు వచ్చిపోవాలని మోడీని ట్రంప్ కోరారు. క్రొయేషియాలో పర్యటించాల్సి ఉన్నందున అమెరికాలో పర్యటించడం కుదరదని ట్రంప్‌నకు మోడీ సుతిమెత్తగా చెప్పి ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించడం ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం. ఈ సందర్భంగా భారత్‌లో ఈ ఏడాది తరువాత జరగనున్న క్వాడ్ సదస్సుకు ట్రంప్‌ను మోడీ ఆహ్వానించడం కొసమెరుపు. మోడీ జి7 సదస్సు అధ్యక్ష ఉపన్యాసంలో ట్రంప్ పేరు ప్రస్తావించకుండా బాధిత దేశానికి, ఉగ్రవాద దేశానికి కృత్రిమ సమానత్వాన్ని అమెరికా అధినేత ఆపాదించడాన్ని ఆక్షేపించారు. మోడీతో టెలిఫోన్ సంభాషణ తరువాత కూడా శ్వేతభవనం వద్ద మీడియాతో ప్రపంచం లోని దేశాల మధ్య సంఘర్షణలను నివారించే శాంతిదూతగా తనకు తాను ఆపాదించుకుంటూ యుద్ధాలను తాను ఆపగలిగానని ప్రస్తావించారు. ట్రంప్ యూటర్న్ అయినప్పటికీ, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ట్రంప్ వైఖరిపై విపక్షాలు తీవ్ర నిరసన తెలియజేసిన నేపథ్యంలో మోడీ తన వైఖరిని ట్రంప్‌కు గట్టిగా వివరించడంలో కృతకృత్యులయ్యారు. జి7 సదస్సు సందర్భంగా మోడీ చెప్పుకోదగిన కీలకమైన మరో అంశాన్ని సాధించగలిగారు. భారత్ కెనడా మధ్య గత రెండేళ్లుగా దౌత్యపరమైన ప్రతిష్టంభనకు ముగింపు పలికారు. వీలైనంత త్వరలో భారత్, కెనడా దేశాల్లో పరస్పరంగా హైకమిషనర్లను తిరిగి నియమించుకోవడానికి నిర్ణయం తీసుకున్నారు. జస్టిన్ ట్రూడో వారసుడు మార్క్ కార్నీ జి7 సదస్సులో మోడీతో చర్చలు జరిపిన తరువాత ఉభయ దేశాల మధ్య దౌత్య విభేదాలను పరిష్కరించుకుని సంబంధాల పెంపునకు నిర్ణయించడం దౌత్యపరంగా విజయం సాధించినట్టే. ట్రంప్ టారిఫ్‌ల భారానికి కెనడా ఆర్థికంగా అతలాకుతలమవుతున్న సంగతి తెలిసిందే. ఈ అంశం కూడా చర్చల్లో చోటు చేసుకుంది. ఇదిలా ఉండగా భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు కెనడా కేంద్రంగా మారుతోందని భారత్ గత కొన్నాళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నా పట్టించుకోని కెనడా ప్రభుత్వంలో ఇప్పుడు మార్పు వచ్చింది. భారత్‌లో హింసను ప్రోత్సహించడానికి, దాడులు చేయడానికి అవసరమైన నిధులు సమకూర్చుకోడానికి ఖలిస్థానీ అతివాదులు కెనడాను తమ స్థావరంగా వినియోగించుకుంటున్నారని కెనడా ఒప్పుకోవడం విశేషం. ఈ మేరకు కెనడా నిఘా సంస్థ నివేదిక వెల్లడించింది. భారత్ లోని పంజాబ్ ప్రాంతంలో ప్రత్యేక ఖలిస్థానీ దేశం తీసుకు రావాలని ఈ అతివాదులు కుట్రలు పన్నుతున్నారని ఆ నివేదిక హెచ్చరించింది. 2023 లో ఖలిస్థానీ వేర్పాటువాద నేత హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య సంఘటనతో భారత్, కెనడా దేశాల మధ్య విభేదాలు తీవ్ర రూపం దాల్చాయి. నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల ప్రమేయం ఉందని సాక్షాత్తు ఆనాటి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోనే ఆరోపించడంతో దౌత్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. అయితే కెనడాలో కొత్తగా మార్క్ కార్నీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భారత్‌తో దౌత్య సంబంధాలను తిరిగి పునరుద్ధరించుకోవాలని కెనడా ఆకాంక్షించింది. జి7 దేశాల కూటమిలో భారత్‌కు సభ్యత్వం లేకపోయినా భారత ప్రధాని మోడీని కెనడా ప్రధాని మార్క్ కార్నీ ప్రత్యేకించి ఆహ్వానించడం కీలక మలుపు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

సిద్దిపేట, పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికి తమ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తోందని అన్నారు. సిద్దిపేట జిల్లాకు 12వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు. ప్రతి గ్రామంలోని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తామని అన్నారు. పేదరికాన్ని దూరం చేయాలని ఇందిరాగాంధీ గరీబ్ హటావో పేరుతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ పేదలకు మంచి చేయాలనే 200యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నారని పేర్కొన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండా భూదేవి గార్డెలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మీడియాతో మాట్లాడుతూ.. సిద్దిపేటలో అడ్వాన్స్ టెక్నాలజీతో స్కిల్ డెవలప్‌మెంట్‌ని ప్రారంభిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే హామీలు నెరవేరుస్తారా అని ప్రజల్లో అనుమానం ఉండేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రూ. 8లక్షల కోట్లు అప్పు అయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కంకణం కట్టుకుందని మంత్రి వివేక్ తెలిపారు. మ ప్రభుత్వం పేదలను ఆదుకోవాలని ఆలోచన చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. మహిళలకు రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఉచిత బస్ సౌకర్యం అందిస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు రూ. 23వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. సుమారు రూ.10వేల కోట్ల రైతు భరోసా నిధులను సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విడుదల చేశారని తెలిపారు. రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని చెప్పారు. సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం రూ.500ల బోనస్ ఇస్తోందని వెల్లడించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. అంతకుముందు గజ్వేల్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమావతి పాల్గొన్నారు. గజ్వేల్‌లో 3వేల డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు.

# జగన్ ఏమి చెప్పాలనుకుంటున్నారు?



అమరావతి,వైసీపీ అధినేత జగన్ పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్లకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ పర్యటన సంద ర్భంగా వైసీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, ఆ ఫ్లెక్సీల్లో రాసిన డైలాగులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ప్రజాస్వామ్య ంలో ఇలాం టివాటికి చొటు లేదనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో జగన్ స్పందించారు. అవును... “2029లో వైసీపీ అధికారంలోకి రాగానే గంగమ్మ జాతరలో వేట తలలు నరికినట్టు రప్పా రప్పా నరుకుతాం ఒక్కొక్కడినీ..!” అంటూ జగన్ పర్యటన సందర్భంగా వైసీపీ శ్రేణులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అవుతోన్న వేళ.. వైఎస్ జగన్ స్పందించారు. ఇందులో భాగంగా... ఆ తరహా తీరును వెనకేసుకు రావడం గమనార్హం. ఈ సందర్భంగా స్పందించిన జగన్... “గంగమ్మతల్లి జాతరలో పొట్టేళ్ల తలలు నరికినట్టు నరికేస్తా” అని పోస్టర్ పెట్టారు. అది ‘పుష్ప’ సినిమా డైలాగ్. అది పోస్టర్ లో పెట్టినా తప్పేనా..? మనం ప్రజాస్వామ్యం లోనే ఉన్నామా..? పుష్పలో ఫొటోలు పెట్టినా,గడ్డం చేతితో అటు రుద్దుకున్నా.. ఇటు రుద్దుకున్నా తప్పేనా?” అని కాస్త వ్యంగంగా స్పందించారు!ఇదే సమయంలో... “ఆ పోస్టర్ పట్టుకున్న వ్యక్తికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కూడా ఉందట.. అంటే.. టీడీపీ సానుభూ తిపరుడు కూడా చంద్రబాబుపై కోపంతో మారాడని సంతోషం పడదాం.. తెలుగుదేశం పార్టీని రప్పా.. రప్పా.. కోసేస్తా అని అంటున్నాడని ఆనందపడదాం” అంటూ వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే... అది సినిమాలో డైలాగ్ అన్న విషయం ఆ ఫ్లెక్సి పెట్టిన వ్యక్తితో పాటు, జగన్ తో పాటు అందరికీ తెలిసిన విషయమే. కాకపోతే.. రాజకీయాల్లో, ప్రజాస్వామ్యం లో అలాంటి డైలాగులకు చోటు ఉందా అనేది ప్రశ్న! ఆ ఫోస్టర్ పెట్టిన యువకుడు ఏదో ఆవేశంగానో, అజ్ఞానంతోనో పెట్టాడను కున్నా.. అతడి పని పోలీసులు చూసుకుంటారు. అయితే... ఐదేళ్లు రాష్ట్ర ముఖ్య మంత్రిగా పనిచేసిన జగన్.. ఇలాంటి విషయాల్లో కార్యకర్తలను మందలించాలి.. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్లకార్డులు ప్రదర్శించినవారిపై చర్యలు తీసుకోవాలి.. అది లేదు సరికదా... అవి సినిమా డైలాగులని, అవి కూడా చెప్పుకున్నా తప్పేనా అని మాట్లాడటం ఏమాత్రం ఆహ్వానించదగ్గ పరిణామం కాదని అంటున్నారు పరిశీలకులు! సమాజ ంలో ఉద్రిక్తతలు రేపే ఇంకా చాలా డైలాగులు చాలా సినిమాల్లో ఉంటాయి.. వాటిలో కొన్ని బూతులు కూడా ఉంటాయి. వాటన్నింటిని కూడా పోస్టర్స్ లో పెట్టి ప్రదర్శించమని జగన్ చెబుతున్నారను కోవాలా.. లేక, తన కార్యకర్తలు ఫ్లెక్సీల్లో పెట్టిన ఆలోచనే తన మనసులో కూడా ఉందని, తనకు మరోసారి అధికారం ఇస్తే జరిగేది అదే అని చెప్పాలనుకున్నారా అని ప్రశ్నిస్తున్నారు.

**చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్!:**

జగన్ పల్నాడు జిల్లా పర్యటనపై తాజాగా చంద్రబాబు స్పందించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగా.. ఇరుకు సందుల్లో సమావేశాలు నిర్వహించారు.. హింసను ప్రోత్సహించి పోలీసులపై నిందలు మోపారు.. రాష్ట్రంలో ఎప్పుడైనా ఇలాంటి పోకడలు చూశారా? చంపండంటూ ప్లకార్డుల ప్రదర్శనతో ఆనందిస్తున్నారు అని చెప్పిన చంద్రబాబు... సీరియస్ గా రియాక్ట్ అయ్యారు. ఇందులో భాగంగా... సమాజంలో ఇలాంటి పోకడలు చాలా ప్రమాదకరమని.. గంజాయి, బెట్టింగ్ బ్యాచ్ లు, రౌడీలకు విగ్రహాలు పెడుతున్నారని.. రాజకీయం చేస్తే వదిలిపెట్టనని.. తాట తీస్తా అని చంద్రబాబు మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే నాగమల్లేశ్వరరావు చనిపోయారని.. కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందే ఆ వ్యక్తి చనిపోయారని చెప్పిన చంద్రబాబు.. ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఇప్పుడు పరామర్శా? అని ప్రశ్నించారు.

# పత్తివైపు అధిక రైతుల మొగ్గు

ఆదిలాబాద్,అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్న చందంగా మారింది మిర్చి రైతుల పరిస్థితి. ప్రభుత్వాల అసమర్థత కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడారు. కనీసం పండించిన పంటను అమ్ముదామంటే మార్కెట్లో కొనేవారు కరవయ్యారు. దిక్కుతోచక పంటను కొందరు స్వయాన తగులబెట్టి తమ కడుపు మంటను వెళ్లగక్కారు. మరికొందరు కూలీ కూడా వెళ్లదని పంటను చేలల్లోనే వదిలేసారు. చేసేది లేక నిస్సహాయంగా ఆగ్రహాన్ని, ఆవేదనను తమలోనే అణచివేసుకున్నారు. దీంతో ప్రస్తుతం మళ్లీ మిర్చివేయాలంటేనే భయపడుతున్నారు. దీంతో మరోమారుపత్తి వేసేందుకు రైతులు సమాయత్తం అయ్యారు. మిరప పంట సాగు చేసినా అందుకు తగ్గట్లు మార్కెట్ సౌకర్యం లేకపోవడం, రోజురోజుకు ధర తగ్గడం వల్ల మిరప పంట సాగుచేసిన రైతులకు శాపంగా మారింది. పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు అన్నదాతలు పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. దీనికితోడు జిల్లాలో మిరప పంటకు అనువైన నేలలు ఉండటంతో ఎక్కువ మంది రైతులు పత్తికి బదులు మిరప వైపు మొగ్గుచూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పత్తి, వరి పంటల తర్వాత మూడో పంటగా మిరప సాగు చేయడం విశేషం. పంటను మార్కెట్‌కు తరలిస్తే ఖర్చులు కూడా వెళ్లక మిరప రైతు కుదేలు అయ్యారు. మొదట తీసిన పంటే పూర్తి స్థాయిలో అమ్మకపోగా.. కనీసం మరో రెండు దఫాలుగా తీయాల్సిన పంట చేలోనే ఉండిపోయింది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. అందుకు తగ్గట్లు ధర లేకపోవడం మిరప రైతులను కుదేలు అయ్యేలా చేసింది. స్థానికంగా మిరప పంటను కొనుగోలు చేసేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో జిల్లా రైతులు పక్క రాష్ట్రంలోని నాగ్‌పూర్ మార్కెట్‌పై ఆధారపడ్డారు. గతేడాది పలికిన ధరే ఈసారి పలుకుతుందని.. కష్టాలు తీరుతాయని కౌలుకు తీసుకొని కొందరు పంట సాగు చేశారు. మిర్చి ద్వారా నష్టపోయిన రైతులు ఇప్పుడు పత్తి ద్వారా అదృష్టం పరీక్షించుకోబోతున్నారు.

# అంతరించిపోతున్న బీడీ పరిశ్రమ

నిర్మల్, ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా జిల్లాలో బీడీ పరిశ్రమ దాదాపుగా అంతరించిపోయిందనే అంటున్నారు. రోజురోజుకూ బీడీ పరిశ్రమ బలహీన పడుతుండటం కార్మికులకు శాపంగా మారుతోంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు, సిగరెటఁ వినియోగ ప్రాబల్యం పెరగడం లాంటి అంశాలన్నీ బీడీ పరిశ్రమను దెబ్బతీస్తూ వస్తున్నాయి. వేలాది మంది బీడీ కార్మికులకు ఉపాధిపై భరోసా రోజురోజుకూ కరవవుతున్న క్రమంలో తప్పుకుంటు న్నారు. పొగాకు దుష్ఫలితాలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం లక్షలాది మంది బీడీ కార్మికుల జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. కారణం.. బీడీ పరిశ్రమ కేంద్రీకృతమైన ఈ ప్రాంతంలో ప్రత్యామ్నాయ ఉపాధి కరవైంది. బీడీ వినియోగం తగ్గిపోవడంతో ఈ పరిశ్రమ యజమానులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బీడీకి డిమాండ్ వారిపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ స్వయం ఉపాధిపై, వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి తాత్కాలిక ఉద్యోగులుగా తీసుకోనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకొని వీరంతా జీవనం సాగిస్తున్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో నెట్టుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం వీరికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో బతుకులు బాగుపడనున్నాయి. నిర్మల్ జిల్లాలో ఉన్న 60 వేల మంది కార్మికులతో పాటు వారిపై ఆధార పడుతున్న దాదాపు మరో 1.50 లక్షల మందికి ఉంటారని కార్మికశాఖ అధికారులు అంచనా వేశారు. ఉద్యానవనం (పండ్లు, పూలు, కూరగాయల సాగు), కోళ్ల పరిశ్రమ, గేదెలు, గొర్రెల పెంపకం, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, చేతి వృత్తులు, అగర్‌బత్తుల తయారీ, పాపడ్, పచ్చళ్ల తయారీపై ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు వివిధశాఖల్లో దినసరి ఉద్యోగాలుగా పనులు చేసేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టైలరింగ్, బ్యూటీషియన్, బ్యాంకింగ్, ÷నాన్స్, బీమా ఏజెంట్లు, ఆసుపత్రుల్లో సేవలు, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్స్, పశువైద్య సేవలపై శిక్షణ ఇవ్వనున్నారు. బీడీ కంపెనీలు ఎప్పుడు మూతపడుతున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. బీడీలు చుట్టడమే జీవనాధారంగా ఉన్న అనేక కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుంది. స్వయం ఉపాధి పొందేందుకు రుణ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

# అజెండా వర్కవుటయ్యేనా ..!

అమరావతి,రాజకీయాల్లో నాయకులకు అజెండాలు ఉండొచ్చు. పార్టీలపరంగా ఉన్న సిద్ధాంతాలను బట్టి నిర్ణయం తీసుకునే లేదా నిర్మించే అజెండాలను ప్రజల్లోకి తీసుకెళ్లొచ్చు. వాటిపై పోరాటం చేయడం ద్వారా వాటిని ఫాలో కావడం ద్వారా నాయకులు పదవులు కూడా పొందవచ్చు. కానీ సొంత అజెండాలు పెట్టుకుంటే మాత్రం అది చాలా ప్రమాదకరం. కొంతమందికి మాత్రమే ఈ విషయంలో కలిసి వచ్చిన పరిస్థితులు రాష్ట్రంలో చూసాం. చాలామంది సొంత అజెండాలు పెట్టుకుని రాజకీయంగా మనుగడ కోల్పోయిన వారు ఉన్నారు. ఇలా చూసుకుంటే బీజేపీలో సొంత అజెండాని అమలు చేస్తున్నారనే వాదన విష్ణుకుమార్ రాజు విషయంలో బలంగా వినిపిస్తోంది. విశాఖ ఉత్తరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న విష్ణు కుమార్ రాజు బిజెపి లో ఇతర నాయకులకు భిన్నంగా సొంతంగా అజెండాను ఏర్పాటు చేసుకుని దానిని సాధించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని వాదన వినిపిస్తోంది. గత ఏడాది ఎన్నికలకు ముందు కూడా ఇలానే సొంత అజెండా పెట్టుకున్నారని నాయకులు అంతర్గత చర్చల్లోనే కాదు బహిరంగంగా కూడా వ్యాఖ్యానించారు. టిడిపికి మద్దతుగా ఉన్నారని చంద్రబాబుకు అనుకూలంగా వ్యాఖ్యలు చేస్తున్నారని సోము వీర్రాజు లాంటి వాళ్ళు బహిరంగంగానే విమర్శించారు. దీంతోనే పార్టీలో ఆయన ఒకరకంగా ఏకాకిగా మారిన పరిస్థితి గత ఐదేళ్లలో చూడాల్సి వచ్చింది. ఆ తర్వాత కూడా ఆయన తన విధానాన్ని మార్చుకోలేకపోతుం డడం ప్రస్తుతం పార్టీలో అంతర్గత చర్చిగా మారింది. సొంత అజెండాను పెట్టుకుని ఉద్దేశపూర్వకంగా కొంతమంది వ్యక్తులను ఆయన టార్గెట్ చేస్తున్నారని ఇది పార్టీకి మంచిది కాదని కూడా సోము వీర్రాజు లాంటి నాయకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా విశాఖపట్నంలో భూముల కుంభకోణం విషయంలో విష్ణుకుమార్ రాజు లేవనెత్తుతున్న అభిప్రాయాలను చంద్రబాబు సైతం యావగించుకునేలాగా ఉన్నాయనేది ప్రస్తుతం వినిపిస్తున్న మాట. సాధారణంగా వైసిపి పై విష్ణుకుమార్ రాజు నిప్పులు చేరుగుతారు. అసెంబ్లీలో అయినా ఇటు బయటైనా ఎక్కడ అవకాశం వచ్చినా తనకు ఇవ్వాల్సిన కాంట్రాక్టు సొమ్ములు ఇవ్వకుండా ఏడిపించారని తనను కూడా వైసీపీలో చేరాలని ఒత్తిడి చేశారని గతంలో ఆయన చెప్పుకొచ్చారు. ఆ తర్వాత కూడా జగన్ను పదేపదే టార్గెట్ చేస్తూ వచ్చారు. దీంతో కూటమి నాయకులు విష్ణును ఓన్ చేసుకుని వారి పక్కన సీటు కూడా కల్పించిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు కూటమి నాయకుల్ని విష్ణుకుమార్ రాజు టార్గెట్ చేయటం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కేంద్రంగా రాజకీయాలను చేస్తుండడం భూకబ్జాల విషయంలో పోరాటం చేస్తానంటూ ప్రకటనలు చేయటం వంటివి ఇటు బిజెపిలోను, అటు కూటమి నాయకులను కూడా అసంతృప్తిని రేపు తోంది. తద్వారా విష్ణుకుమార్ రాజు అందరికీ దూరం అవుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. నిజానికి విష్ణుకుమార్ రాజు ఉత్తరాంధ్ర రాజకీయాల్లో బలమైన నాయకుడిగా ముఖ్యంగా విశాఖపట్నంలో ఒక పద్ధతి అయిన నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు.

## మత్తడివాగును ఆధునికరించాలి

ఆదిలాబాద్,జిల్లాలోని తాంసి మండలం వడ్డాడి సమీపంలో నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాలకు సాగునీరు అందనుంది. దీనిని పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి తీసుకుని వస్తే రైతులకు మేలు జరుగుతుంది. జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్ మండలాల రైతుల భూములకు సాగునీరు అందించేందుకు తాంసి మండలం వడ్డాడిలో 2004లో మత్తడివాగు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2008 ఆగస్టులో ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. ఈ కాలువ ద్వారా వడ్డాడి, కప్పర్ల, బండలనాగాపూర్, జామిడి, చాంద-టి. సిర్సన్న, భోరజ్, సావర్గాం, తరోడ, మల్లాపూర్ భీంసరి, జందాపూర్ గ్రామాల్లోని 8500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేపట్టారు. ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. రైతులు రెండు పంటలు సాగుచేసే ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రాజెక్టుల ఆధునికీకరణతో ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా మారను న్నాయని రైతులు అంటున్నారు. రైతులు రెండు పంటలు సాగుచేసుకునే అవకాశాలుండడంతో ప్రభుత్వం ఈ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఈ కాలువ నిర్మాణంతో తాంసి మండలం హస్నాపూర్, పొన్నారి, తలమడుగు మండలం ఖోడద్ గ్రామాలకు చెందిన రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

## అస్తవ్యస్థంగా డ్రైనేజీ వ్యవస్థ

వరంగల్, అసంపూర్తి డ్రైనేజీలు, నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగు గుంతలు అభివృద్ధిని వెక్కిరిస్తుంటాయి. ఏటా కోట్ల నిధులు ఖర్చుచేస్తున్నా ఏ కాలనీకి మురుగు నుంచి విముక్తి దక్కడంలేదు. దశాబ్దాల కాలంగా మున్సిపల్ పట్టణాలకు డ్రైనేజీలకు వెచ్చిస్తున్న నిధులు నిష్ఫలం అవుతున్నాయి. నిధులు ఖర్చు అవుతున్నా మురుగు నీటికి పరిష్కారం లభించడం లేదు. ఇలా పెద్ద నగరాల్లో సైతం డ్రైనేజీ అవ్యవస్థను చూస్తే ఈ అనుమానాలు కలగకమానవు. దశాబ్ద కాలంలో సుమారుగా కోట్ల వరకు వ్యయం చేసి ఉంటారని అంచనా. ఏటా బల్దియాకు విడుదలయ్యే నిధుల్లో మొదటి ప్రాధాన్యంగా డ్రైనేజీలకే కేటాయిస్తుంటారు. ఇన్ని నిధులు కేటాయించినా ప్రణాళిక లేని నిర్మాణాలతో నిధులు నిష్ప్రయోజనం మారుతున్నాయి. కాలువల నిర్మాణం చేపట్టే సమయంలో నిర్దేశిత ప్రమాణాలు పాటించక పోవడం, నాణ్యతకు తిలోదకాలివ్వడంతో మురుగు నీటి పారుదల వ్యవస్థ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పాత కాలువల స్థానంలో కొత్తవి వేస్తున్నా పైపులు వేయకుండా మళ్లీ ఓపెన్ డ్రైనేజీ కొనసాగిస్తున్నారు. దీంతో మళ్లీ చెత్తాచెదారం నిండడం మినహా ప్రయోజనం ఉండదు. ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం, ప్రణాళిక, ప్రణాళికేతర, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక పద్దుల కింద వచ్చిన నిధులతో వీటి నిర్మాణాలు చేపట్టారు. ఈ ఒక్క ఏడాదిలోనే పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. అంతకుముందు వివిధ పథకాల్లో వచ్చిన నిధులు ఈ పనులకే వెచ్చించారు. ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో బెటర్మెంట్, డెవలప్మెంట్ పేరిట రుసుములు వసూలు చేస్తారు. ఇందుకు తగ్గట్టుగానే మురుగు కాలువలు, రహదారులు, తాగు నీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. లేఅవుట్ లేకుండా రోజుకో కాలనీ పుట్టుకొస్తున్న తరుణంలో భగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ పెద్ద సవాలుగా మారింది.

# పాఠశాల స్థాయిలోనే యోగాకు ప్రణాళిక రావాలి



న్యూఢిల్లీ,ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాఠశాలస్థాయి నుంచే యోగాను అలవాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పుడిప్పుడే దీనిని ఓ క్లాస్‌గా గుర్తించి అలవాటు చేస్తున్నారు. సరస్వతీ శిశుమందిర్ లాంటి వాటిలో ఇది తప్పనిసరిగా ఉంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. ఆట పాటలు, యోగాసనాలతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం నింపేందుకు ముందుకు రావాల్సి ఉంది. క్రీడాంశాల్లో యోగగాను జోడించి అనేక ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ప్రతి ఏటా విద్యాశాఖ ఉపాధ్యాయులకు పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను అందిస్తోంది. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి మారిన పాఠ్యాంశాల ఆధారంగా బోధన తీరు మెరుగపడేలా చర్యలు తీసుకుంటుంది. ఎన్నో ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యా యులకు ఎలాంటి శిక్షణ తరగతులు లేవు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల ఆరోగ్యం, ఇతర అంశాలపై దృష్టిసారించలేక పోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన విద్యాశాఖ వ్యాయామ ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించింది. యోగా, ఆరోగ్యం, కరాటే, మానసిక అంశాలపై తర్ఫీదునిచ్చారు. విద్యార్థులకు ఆత్మస్థైర్యం పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు కరవయ్యాయి. ప్రార్థన చేసేందుకు స్థలం కొరత పీడిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఏడాదిలో స్వాతంత్య, గణతంత్య వేడుకల సమయంలో తప్ప క్రీడా పోటీల ఊసేలేదు. ఆసక్తి ఉన్నా విద్యార్థుల్లో ప్రతిభ కనుమరుగవుతోంది. అప్పడప్పుడు మండల, జిల్లా స్థాయి పోటీలకు తప్ప రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు కరవైంది. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రాధాన్యం లేక నిరాశకు గురవుతున్నారు. ఇన్నాళ్లుగా ఈ అంశాలకు దూరమైన పిల్లలకు సంపూర్ణత చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మానసిక వికాసం, శరీర దారుఢ్యంతోపాటు మెదడు చురుకుదనంతో ఉండేలా సమగ్ర నిరంతర మూల్యాంకనం విధానంలో భాగంగా వ్యాయామ విద్యను తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. యోగా, ఆత్మరక్షణ కోసం కరాటే, క్రీడలు, ఆర్యోగంతో సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు ను చక్కదిద్దుకుంటారు. ఆటలతోపాటు వ్యక్తిగత ఆరోగ్య పాఠాలు బోధించాలి. క్రీడల్లో ఉత్తేజపూరితంగా తర్ఫీదు ఇచ్చేలా శిక్షణ ఇవ్వాలి.. ప్రతి రోజు వ్యాయామ, ఆరోగ్య విద్యను అమలు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలి. యోగాకు ప్రతి రోజు ఓ పీరియడ్ కేటాయించాలని సూచిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రోజువారీగా నిర్ణయించిన ప్రణాళికను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి. క్రీడా మైదానాలను సిద్దం చేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్న డిమాండ్లు ఉన్నాయి. ఇతర దేశాల్లో బాల్య దశలోనే ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్నారు. మన దగ్గర ఆటలాడు కోవాలనే ఆసక్తి ఉన్నా ఆట స్థలం కరువే...ప్రతిభ ఉన్నా శిక్షకుడి సేవలు దూరమే...ఎలాంటి శిక్షణ లేకున్నా ఏకలవ్యులా పలు పోటీల్లో విద్యార్థులు సత్తాచాటుతున్నారు. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ...మరికొన్నిటికి పోస్టుల మంజూరు లేదు...విద్యార్థుల్లో మానసిక పరిపక్వత లోపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు ఆందోళన కల్గిస్తున్నాయి. క్రీడా మైదానాలు లేని చోట సమీపంలో అందుబాటు లో ఉన్న స్థలాలను ఎంపిక చేసుకుని తీసుకోవాలి. సగానికిపైగా ఖాళీలు ఉండటంతో వీటిని భర్తీ చేయాలి. క్రీడాకారుల ప్రయోజనం కోసం ఆట వస్తువులు, ఇతర వసతులు కోసం నిధులను కేటాయించాలి. విద్యాక మిటీ సభ్యులను భాగస్వాములను చేసి ప్రజా విరాళాలతో ముందుకుసాగేలా ప్రతిపాదనలు తయారు చేసుకోవాలి. ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ విద్య అమలు చేస్తున్నప్పటికీ ప్రాథమికస్థాయిలో లేకపోవడం అన్యాయమే. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను పకడ్బందీగా అమలు చేస్తుండగా ప్రైవేటు పాఠశాలల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకమే. పలు పాఠశాలలకు క్రీడా వసతులు లేవు. పాఠశాలల గుర్తింపునకు ముందు కనీస వసతులు ఉంటేనే అనుమతి పత్రం ఇవ్వాలి. నిబంధనలు పాటించకుండానే అనుమతులు ఇవ్వడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రార్థన చేసుకునేందుకూ స్థలం లేకపోవడం గమనార్హం. ప్రైవేటు పాఠశాలల్లో కూడా వ్యాయమ విద్య పక్కాగా అమలు చేస్తే క్రీడా వెలుగులు అందుతాయి.

## సంక్షోభంలో వ్యవసాయ రంగం

ఏలూరు,దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని కౌలు రైతు సంఘ నేతలు అన్నారు. బడా కంపెనీలకు లాభం చేకూర్చేందుకు వ్యవసాయ భూములు లాక్కుని రైతులను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 కౌలు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని రక్షించుకునేందుకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఉపాధి హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో భూతాపం పెరిగిపోయి వాతావరణ సమతుల్యం దెబ్బతిన్నదన్నారు. వ్యవసాయరంగంపై అధ్యయనం చేసేందుకు 52 కమిషన్లు వేశారని, ఒక్క కమిటీ సిఫారసు కూడా అమలు చేయలేదని తెలిపారు.

## నగరంలోని పారామౌంట్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్

హైదరాబాద్,హైదరాబాద్ నగరంలోని పారామౌంట్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున పెద్దఎత్తున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. అక్రమ చట్టవ్యతిరేక కార్యకలాపాలు, విదేశీయుల అక్రమ నివాసాలపై ఆధారంగా పోలీసులు ఈ ఆపరేషన్ చేపట్టారు. సుమారు 150 మంది పోలీసులు తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఈ కాలనీని చుట్టుముట్టి సోదాలు ప్రారంభించారు. లా అండ్ ఆర్డర్, టాస్క్ ఫోర్స్, హెచ్ఎన్‌యూ, ఏఆర్ విభాగాలకు చెందిన పోలీసులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు. ఈ సెర్చ్‌లో నైజీరియా, ఇథియోపియా, కెన్యా, సోమాలియా దేశాలకు చెందిన వలసదారులు పెద్దఎత్తున ఉన్నట్లు గుర్తించారు. వీరిలో చాలామంది భారతదేశం వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా నివసిస్తూ ఇల్లీగల్ కార్యకలాపాల్లో భాగం అవుతున్నట్లు పోలీసుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల్లో మొత్తం 18 మంది విదేశీయులు వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా జీవిస్తున్నట్లు గుర్తించారు. వారిని గుర్తించిన పోలీసులు త్వరలోనే డిపోర్ట్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సోదాల సందర్భంగా డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 50కి పైగా బైకులు, 5 కార్లను పోలీసులు సీజ్ చేశారు. అంతేకాక, గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్న బెల్ట్ షాపులు, హుక్కా సెంటర్లను గుర్తించి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు, గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. మద్యం అక్రమ నిల్వలు బయటపడటంతో, స్థానికంగా నడుస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలపై మరింత దృష్టి పెట్టనుని పోలీసులు అన్నారు. ఈ సందర్భంగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ, 'పారా మౌంట్ కాలనీలో కార్డన్ సెర్చ్‌తో పాటు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండిపోయిన విదేశీయులను గుర్తించాం. వారి వివరాలు సేకరించి, త్వరలోనే డిపోర్ట్ చేయనున్నాం. మాదకద్రవ్యాల విషయంలో మేము చాలా సీరియస్‌గా ఉన్నాం. ఈ సెర్చ్‌లో డ్రగ్స్ లభించలేదు. కానీ భవిష్యత్‌లో ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌తో నగరంలోని ఇతర అనుమానస్పద ప్రాంతాల్లో కూడా ఇలాంటి తనిఖీలు జరపనున్నట్లు పోలీసులు సంకేతాలు ఇస్తున్నారు. విదేశీయుల పేరుతో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు ఇది ఒక ముందడుగుగా మారింది.

## పదిలక్షల సాయం ప్రకటించిన జగన్

గుంటూరు, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటన సందర్భంగా ఏటుకూరు బైపాస్ వద్ద కారు ఢీకొని మృతి చెందిన వెంగళాయపాలెంకు చెందిన చీలి సింగయ్య కుటుంబానికి జగన్ పదిలక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, బలసాని కిరణ్ కుమార్, నూరిఫాతిమాలు శుక్రవారం వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వైసీపీ పార్టీ తరఫున 10 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును అందజేశారు. సింగయ్యను ఢీకొట్టిన వాహనం వైసీపీ నేత దేవినేని అవినాష్ ప్రధాన అనుచరుడు గొట్టిపాటి హరీష్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు. గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ 'సింగయ్య వైసీపీ కార్యకర్త, వైఎస్ జగన్ అభిమాని. జగన్ పర్యటనలో కారు యాక్సిడెంట్‌తో సింగయ్య మృతి చెందారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది. విషయం తెలిసిన వెంటనే జగన్ ఆయన కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును సింగయ్య భార్యకు అందించాం. సింగయ్య మృతిని కూడా ప్రభుత్వం రాజకీయం చెయ్యాలని చూసింది. జగన్ పర్యటనపై వైసీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా ఎవరూ భయపడరు, వాటిపై న్యాయపోరాటం చేస్తాం. వైసీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా నిర్బంధిస్తే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. జగన్ పర్యటనకు ప్రజలను రానివ్వకుండా చేయాలని ప్రభుత్వం, పోలీసులు ద్వారా కుట్ర పన్నింది. ఆ కుట్రను ఛేదించుకుంటూ వేలాది మంది జనం తరలివచ్చారని అన్నారు. 'సింగయ్య వైసీపీకి కరుడుగట్టిన కార్యకర్త. యాక్సిడెంట్‌లో ఆయన చనిపోవడం బాధాకరం. ఈ విషయం తెలుసుకోగానే వైఎస్ జగన్ మమ్మల్ని అందరినీ సింగయ్య ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి అండగా ఉండమని ఆదేశించారు. జగన్ పంపిన 10 లక్షలు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును ఆ కుటుంబానికి అందించాం. సింగయ్య కుటుంబానికి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# మూడో ప్రపంచయుద్ధం అనివార్యమా?



న్యూఢిల్లీ,గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే ప్రపంచం మూడో యుద్ధం వైపు అడుగులేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ మధ్య చాలా దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, యుద్ధాలు ప్రస్తుతం ఉచ్ఛదశలో ఉన్నాయి. నానాటికీ పెచ్చరిల్లుతున్న మధ్యప్రాచ్యంలోని సమర సన్నాహాలు, యూరప్?లో ఘర్షణలు, ఆసియాలో నివురుగప్పిన నిప్పులాంటి స్థితి.. మూడో ప్రపంచయుద్ధం ఎంతో దూరంలో లేదని సూచిస్తున్నాయి. ఈ పరిస్థితికి కారణమవుతున్నపెద్దలెవరో తెలుసుకోవడానికి గొప్పగా కష్టపడనవసరం లేదు. అందులో ఐదారుగురు ముఖ్యమైన నేతలు ఉన్నారు. మిగతావారంతా వారి స్వంత శత్రుదేశాలతో తలపడే ప్రయత్నాల్లో ఉన్నారు. వీరందరిలో మిత్రులున్నారు. శత్రువులూ ఉన్నారు. వారో పక్క, వీరో పక్క కలిస్తే, ఇక మనం మరో ప్రపంచ యుద్ధంలోకి అడుగుపెట్టినట్లే. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్? ట్రంప్?, బెంజమిన్? నెతన్యాహు, అయొతుల్లా ఖమేనీ, వ్లాదిమిర్? పుతిన్?, ? వ్లదీమిర్ జెలెన్?స్కీ ప్రధానపాత్రధారులు కాగా, పాకిస్తాన్? మిలిటరీ జనరల్ ఆసిఫ్? మునీర్?, బ్రిటిష్? ప్రధాని కీర్? స్టార్మర్? సహాయపాత్రలు పోషిస్తున్నారు. యుద్ధక్షేత్రంలో ఇప్పటికే ఉన్న రష్యా-యూక్రెయిన్?, ఇజ్రాయెల్%-ఇరాన్‌లలో అమెరికా అటు ఉక్రెయిన్?కు, ఇటు ఇజ్రాయెల్?కు ప్రధాన మద్దతుదారుగా మాత్రమే కాక, వారికి అండగా యుద్ధంలోకి దిగడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం విషయమంతా ఇజ్రాయెల్?%-%ఇరాన్? మీదే ఉంది కాబట్టి, ఇరాన్?ను సర్వనాశనం చేసేదాకా అమెరికా, ఇజ్రాయెల్? నిద్రపోవు. బ్రిటన్? కూడా ఈ సమర సన్నద్ధత దృష్ట్యా తను కూడా తన ఏర్పాట్లలో మునిగిఉంది. యుద్ధం మొదలై ఐదు రోజులైనా, ఎవరూ తగ్గేట్టుగా కనబడటంలేదు. ఇరాన్? అణుశుద్ధి కేంద్రం, అధ్యక్షుడు ఖమేనీలను పూర్తిగా నిర్మూలించందే ఇజ్రాయెల్? శాంతించేలాలేదు.

### టార్గెట్ ఫోర్డో భూగర్భ అణు స్థావరం!

మరోపక్క అమెరికా అధ్యక్షుడు ట్రంప్?, జీ7 సదస్సను వీడి అర్ధంతరంగా స్వదేశానికి పయనమయ్యాడు. వెంటనే సంధాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా తన అధికారగణాన్ని ఆదేశించడం చూస్తే, ఇరాన్?కు మూడినట్లే కనబడుతోంది. బహుశా రాబోయే రెండు మూడు రోజుల్లో ఏదో పెద్ద సంఘటనే జరిగే అవకాశముంది. ఇరాన్? రహస్య అణుస్థావరమైన ఫోర్డో? భూగర్భ కేంద్రం ధ్వంసం చేయడమే అజెండా అయుండవచ్చు. ఇప్పటికే ఇజ్రాయెల్? దానిపై దాడులు చేసింది కానీ, భూగర్భంలో చాలా లోతైన ప్రదేశంలో, అత్యంత భద్రత మధ్య ఉన్న ఫోర్డో, నతాంజ్? కేంద్రాలను నాశనం చేయడం దానివల్ల కాదు. అందుకు కావాల్సిన బాంబులు అమెరికా వద్ద మాత్రమే ఉన్నాయి. ఫోర్డో ? ఓ పర్వతం అడుగున భూమి లోపల ఉంది. దాన్ని ధ్వంసం చేయాలంటే అమెరికా వద్ద ఉన్న జీబీయూ -57 బంకర్ బస్టర్ బాంబు వల్లే సాధ్యం. 14టన్నుల బరువుండే ఈ బాంబు పర్వతంలోపలికి చొచ్చుకుపోయి భూగర్భంలో పేలిపోతుంది. దాన్ని ప్రయోగించగల బీ-2 బాంబర్లు ఇప్పటికే మధ్యప్రాచ్యానికి చేరుకున్నాయి. అమెరికా నౌకాదళం కూడా సమీపంలోనే మోహరించిఉంది. ఇరాన్? అధినేత ఖమేనీని అంతం చేయాలని పట్టుదలతో ఉన్న నెతన్యాహూను నియంత్రించడం ట్రంప్? వల్లకావడంలేదు. ఖమేనీ అంతమే యుద్ధానికి అంతం అని నెతన్యాహూ గట్టిగా భావిస్తున్నాడు. పైగా ఆయన ఎక్కడ దాక్కున్నాడో తమ వద్ద ఖచ్చితమైన సమాచారముందని అమెరికా అధ్యక్షుడు ప్రకటించాడు కూడా.

### తీవ్ర స్థాయికి ఉక్రెయిన్, రష్యా యుద్ధం

ఉక్రెయిన్-రష్యా యుద్ధం కూడా తీవ్రస్థాయికి చేరుకుంది. ఉక్రెయిన్ చేసిన డ్రోన్ దాడి వల్ల తన మెజారిటీ బాంబర్లను కోల్పోయిన రష్యా అవమానాగ్రహాలతో రగిలిపోతోంది. చిన్న చిన్న డ్రోన్లు తన పెను బాంబర్లను నాశనం చేయడం రష్యా తట్టుకోలేకపోతోంది. అందుకే కీవ్? మీద భారీ దాడికి దిగింది. ఇజ్రాయెల్?.. పాలస్తీనాపై కూడా దాడి కొనసాగిస్తోంది. గాజాలో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. వేలాదిమంది చిన్నపిల్లలు ఆహారం లేక చావు అంచున కొట్టుమిట్టాడుతున్నారు. వేరే దేశాలు పంపుతున్న మానవతాసాయం కూడా సరిగ్గా అందడంలేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇది ఒకే ఒక్క యుద్ధపు ఫలితం. ప్రపంచయుద్ధమే వస్తే%ా?

### యుద్ధంలోకి అమెరికా

యుద్ధం ప్రారంభమైందని ఇరాన్ సుప్రీం ఖమేనీ బుధవారం ఉదయం ఎక్స్‌లో ప్రకటించాడు. దీంతో అమెరికా యుద్ధంలోకి నేరుగా దిగబోతోంది. ఖమేనీ ఎక్కడ దాక్కున్నాడో తమకు తెలుసన్న ట్రంప్?, బేషరతుగా లొంగిపోవాలని ఖమేనీకి సూచించాడు కానీ, నేటి ఆయన ప్రకటన లొంగిపోవడమనే ప్రస్తక్తే లేదని, యుద్ధానికే సిద్ధమని, యూదురాజ్యాన్ని రానివ్వబోమని తేల్చి చెప్పింది. ఇరాన్? విదేశాంఖ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్? భాఘై అమెరికా ఈ యుద్ధంలో నేరుగా జోక్యం చేసుకుంటే మధ్య ప్రాచ్యంలో పూర్తిస్థాయి యుద్ధాన్ని చూడాల్సివస్తుందని హెచ్చరించారు. తమ మిత్రులైన అరబ్?దేశాలు, సాటి ముస్లిం దేశాన్ని నాశనం చేయడానికి తమ భూభాగాన్ని అమెరికా వాడుకోవడానికి ఒప్పుకోరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కానీ, ఇరాన్? అణ్వాయుధ సంపత్తిని కలిగిఉండటం కుదరదని తేల్చిచెప్పిన ట్రంప్?, ఆయా కేంద్రాల ధ్వంసానికే మొగ్గు చూపుతాడనేది నిర్వివాదాంశం. నతాంజ్?, ఫోర్డో అణుఇంధన శుద్ధి కేంద్రాలను పూర్తి స్థాయిలో నాశనం చేయాలంటే అది ఒక్క అమెరికాకే సాధ్యం. అందుకే ఇజ్రాయెల్? అమెరికా జోక్యాన్ని కోరుతోంది. బహుశా ఓ రెండు మూడు రోజుల్లో ఈ దిశగా ప్రయత్నాలు జరిగే అవకాశముంది.

### యుద్ధాన్ని కోరుకోవడం అమెరికా సహజ లక్షణం

యుద్ధోన్మాద దేశాల సంఖ్య పెరుగుతూఉండటం ఆందోళన కలిగించే అంశం. నిజానికి అమెరికా ఎప్పుడూ యుద్ధాన్నే కోరుకుంటుంది. తమ ఆయుధాలను, మందుగుండు సామాగ్రిని అమ్ముకోవాలంటే ప్రపంచంలో ఏదో మూల యుద్ధం జరుగుతూనే ఉండాలి. ట్రంప్? లాంటి ఆయుధ బేహారికి ఇదో చక్కటి అవకాశం. ఓ పక్క యుద్ధాలను ఆపేయడానికే పుట్టానంటూ ప్రగల్భాలు పలికే ట్రంప్?, అదే చేత్తో ఆయుధాలు అమ్మచూపుతాడు. అమెరికా అధ్యక్షుడికి ఏ దేశమైనా ఒకటే. పాకిస్తాన్?కూ, భారత్?కు ఆయనెప్పుడూ మంచి స్నేహితుడే. పాకిస్తాన్? నియంత సైనికాధికారిని విందుకు ఆహ్వానిస్తాడు. నరేంద్రమోదీని గట్టిగా ఆలింగనం చేసుకుంటాడు. అమెరికా గత అధ్యక్షుల ధోరణి కూడా అమెరికా ఫస్టే అయినప్పటికీ, ట్రంప్?లా దిగజారలేదు. అత్యున్నత దేశమైన అమెరికాకు అధ్యక్షులుగా హుందాగా ఉండేవారు. మాట్లాడే పద్ధతి, స్నేహాన్ని కోరుకునే తీరు, ఆఖరికి బెదిరించే తీరు కూడా సున్నితంగా ఉండేది. అమెరికాకు తనను మించిపోయే అవకాశమున్న దేశాలను అసలు వదిలిపెట్టదు. రష్యా అయినా చైనా అయినా ప్రస్తుతం భారత్? అయినా తనకు కంటగింపే. అందుకే రష్యా, చైనాలు అమెరికాకు ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్నాయి. డోనాల్డ్? ట్రంప్? వల్ల ఈ పరిస్థితి మరింత దిగజారింది. మరిన్ని దేశాలను తనకు శత్రువులుగా మార్చుకుంటున్నారు.

### అభివృద్ధిలో అమెరికాతో చైనా పోటీ

ఇక చైనా, విస్తీర్ణం దృష్ట్యా ప్రపంచంలోని అతిపెద్ద దేశాల్లో మూడో స్థానంలో ఉంది. అభివృద్ధిలో అమెరికాతో పోటీ పడుతోంది. జీడీపీలో అగ్రరాజ్యం తర్వాతి స్థానం చైనాదే. చైనాది కూడా అమెరికాలాంటి మనస్తత్వమే. విస్తరణవాదం బలంగా ఉన్న చైనా, విపరీతమైన భూసంపద కలిగిఉన్నా, ఇంకా తైవాన్?ను ఆక్రమించుకోవాలని, ఇటు భారత్?తో ఉన్న సరిహద్దును మెల్లగా జరుపుకుంటూ, అరుణాచల్?ప్రదేశ్? నాదేనంటూ వక్రబుద్ధిని చాటుతోంది. భారత్?ను ప్రధాన శత్రువుగా చూసే చైనా, భారత్? చుట్టూ ఉన్న చిన్నచిన్న దేశాలను అప్పులిచ్చి తనవైపుకు తిప్పుకుంటూ మెల్లగా అష్టదిగ్బంధనం చేస్తోంది. ఎటూ పాకిస్తాన్?కు అత్యంత మిత్రదేశంగా ఉంటూనే, నేపాల్?, భూటాన్?, మయన్మార్?, శ్రీలంక, అఫ్ఘనిస్తాన్? లాంటి పేదదేశాలకు అభివృద్ధి ఆశ చూపి లొంగదీసుకుంటోంది. ఒకవిధంగా మూడో ప్రపంచయుద్ధమంటూ వస్తే, చైనా అమెరికాలే మొదలుపెడతాయని, మిగతాదేశాలు ఏదో దానికి మద్దతుగా నిలబడాల్సివస్తుందని సింగపూర్? 'స్ట్రెయిట్స్? టైమ్స్?' పత్రిక పేర్కొంది.

### విస్తరణవాదంతోనే రష్యా కూడా

ఈ భూగోళంపైనే అతిపెద్ద దేశమైన రష్యా కూడా ఇదే విస్తరణవాదంలో ముందుకెళ్తోంది. ఉక్రెయిన్?ను తిరిగి ఆక్రమించుకోవాలని చూస్తున్న రష్యాను నిలువరించడానికి ఉక్రెయిన్?కు అమెరికా సహాయం చేస్తోంది. ఇక్కడా తన వ్యాపారం మాత్రం వదులుకోలేదు. ఉక్రెయిన్?, రష్యా మధ్య యుద్ధం మొదలై ఏళ్లు గడిచినా, ఎటూ తేలడం లేదు. లేదా అమెరికా తేలనివ్వడంలేదు.

### క్షిపణి పరీక్షల్లో ఉత్తర కొరియా

ఉత్తర కొరియా ఒక నియంత పాలనలో ఉంది. కిమ్ ఉన్ జాంగ్ అనబడే ఈ నియంత, కేవలం ఆయుధాల తయారీ, అణుబాంబుల తయారీ పైనే దృష్టి పెట్టి, తన ప్రజలను పట్టించుకోవడమే మానేశాడు. ఓ పక్క తిండిలేక మలమలమాడుతున్న ప్రజలను వదిలేసి, క్షిపణి పరీక్షలలో నిమగ్నమైఉంటాడు. అతడి చేతిలో అణ్వాయుధం, పిచ్చోడి చేతిలో రాయిలాంటిది. దానికి శత్రువైన దక్షిణ కొరియానే కాకుండా అమెరికా కూడా భయపడాల్సిన పరిస్థితి.

ఏ యుద్ధం ఎటువైపు దారితీస్తుందో తెలియని దేశాలు కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో తన సైనిక శక్తిని భారీగా పెంచుకోవాల్సివస్తోంది. అవసరం ఉన్నా, లేకపోయినా, అణుపాటవం కలిగిన దేశాలు తమ అణుబాంబులను ఇబ్బడిముబ్బడిగా పెంచుకుంటున్నట్లు అంతర్జాతీయ అణుఇంధన సంస్థ తెలిపింది. పాకిస్తాన్?కు తినడానికి తిండి లేకపోయినా, అణుబాంబులను మాత్రం బాగానే పోగేసింది. పహల్?గావ్? దుర్ఘటన తర్వాత భారత్? కూడా తన ఆయుధశక్తిని మరోసారి పరిశీలించుకుని, పెంచే దిశగా ఆలోచిస్తోంది. ఇందులో స్వావలంబన సాధించడం కూడా భారత్? లక్ష్యం. ఇలా భారత్?, దక్షిణ కొరియా, యూరప్?, తైవాన్?, అఫ్ఘనిస్తాన్? లాంటి దేశాలు తమ ప్రమేయం లేకుండానే యుద్ధంలోకి లాగబడుతున్నాయి.

### యుద్ధంలో మరణించేది మానవత్వమే

నిజానికి ఇవన్నీ కేవలం ఆధిపత్య ధోరణిని ప్రతిబింబించే చర్యలే. తామే గొప్ప అనే మిథ్యావాదాన్ని పట్టుకుని వేలాడుతూ, ప్రపంచాన్ని క్రమంగా యుద్ధం వైపు నెడుతున్నాయి ఈ దేశాలు. ఓ పక్క సరైన తిండి లేక అల్లాడుతున్న ఆఫ్రికా దేశాల ప్రజలు, యుద్ధక్షేత్రాల్లోని పిల్లలు రోజూ వేలాదిగా మరణిస్తూంటే, చోద్యం చూస్తున్న అగ్రదేశాలు యుద్ధాలకు మాత్రం సై అంటున్నాయి. ఏదేమైనా సాంకేతికంగా ఎంతో ఉన్నతిని సాధించిన మానవజాతి, మానవత్వంతో తన జాతి మనుగడకు, అభివృద్ధికి పాటుపడాల్సిన సమయంలో యుద్ధోన్మాదం వేపు అడుగులేయడం పెను విషాదం. ఈ యుద్ధంలో మరణించబోయేది ప్రజలు కాదు, మానవత్వం.

## ఎంత దూరం ?

న్యూఢిల్లీ,దేశంలో కాంగ్రెస్ పార్టీ అతి పురాతనమైనది. దాదాపుగా చూస్తే నూటాభై ఏళ్ళ చరిత్ర కలిగినది. ఒక విదేశీ వనిత స్థాపించిన కాంగ్రెస్ దేశ స్వాతంత్ర ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించింది. స్వాతంత్ర్యం అనంతరం సుదీర్ఘ కాలం పాటు ఈ దేశాన్ని ఏలింది. ఈ రోజుకు దేశానికి స్వాతంత్రం వచ్చి 78 ఏళు ళ్ళ అయితే అందులో అరవై ఏళ్ల పాటు ఏలింది కాంగ్రెస్ పార్టీనే. ఇక కాంగ్రెస్ పార్టీలో గాంధీ కుటుంబమే ప్రధాని పదవిని హెచ్చు కాలం నిర్వహించింది. నెహ్రూ ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ పాలన కలుపుకుంటే 38 ఏళ్ల పాటు వారే దేశాన్ని పాలించారు. రాజీవ్ గాంధీతో గాంధీల పాలనకు చెక్ పడింది. 1989 డిసెంబర్ లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడి రాజీవ్ మాజీ అయ్యారు. 1991 మేలో ఆయన మరణించారు. ఇక కాంగ్రెసేతర ప్రధానులలో పీవీ నరసింహారావు అయిదేళ్ళ పాటు పాలిస్తే మన్మోహన్ సింగ్ పదేళ్ళ పాటు పాలించారు. గాంధీ వంశంలో ఐదవ తరం వారసుడిగా 2004లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాహుల్ గాంధీ ప్రవేశించారు. ఆయన 34 ఏళ్ళ వయసులో తొలిసారి అమేథీ నుంచి పోటీ చేసి ఎంపీ అయ్యారు. ఆ సమయంలో రెండు సార్లు కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. కానీ రాహుల్ గాంధీ ప్రధాని అవలేదు. చేతిలో అధికారం ఉన్నా ఆయనే వద్దు అనుకున్నారు. అనుభవం రావాలని ఆగినట్లుగా ప్రచారం సాగింది. కనీసం 2009లో అయినా ఆయన ప్రధాని సీటు అఫర్ వచ్చినా తిరస్కరించారు అన్న ప్రచారం అప్పట్లో సాగింది. మొత్తానికి చూస్తే గడచిన మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడి ప్రతిపక్షంలోనే ఉంది. ఇలా చూస్తే కనుక 21 ఏళ్ళ రాహుల్ గాంధీ పొలిటికల్ కెరీర్ లో ఆయన గ్రాఫ్ అయితే నెమ్మదిగానే సాగుతోంది అని చెప్పాలి. గతానికి పోలిస్తే ఆయన రాజకీయంగా రాటు దేలారు. కానీ బీజేపీకి వ్యూహాలకు తగిన ప్రతి వ్యూహాలను రూపొందించడంలో ఇంకా తడబడుతున్నారనే చెప్పాల్సి ఉంది. ఇక 2024 ఎన్నికల తరువాత లీడర్ ఆఫ్ అపోజిషన్ గ లోక్ సభలో ఆయన కేబినెట్ హోదాతో స్థానం దక్కించుకున్నారు . ఒక విధంగా చెప్పాలంటే రాహుల్ గాంధీ పొలిటికల్ కెరీర్ లో ఇదే ఆయన అందుకున్న అతి పెద్ద అధికార పదవి. ఒక విధంగా ఆయన వెయిటింగ్ ప్రైమ్ మినిస్టర్ గా కూడా ఉన్నారు.

# కాంగ్రెస్‌లో కొండంత గొడవ.. ఫైర్ బ్రాండ్ రచ్చ..



హైదరాబాద్,కొండా కుటుంబం. కొండా సురేఖ, కొండా మురళి. తెలంగాణలో ఫైర్ బ్రాండ్ కపుల్స్. ఇద్దరూ ఇద్దరే. మాస్ లీడర్స్. మాస్ డైలాగ్స్. మాటలు తూటాల్లా ఉంటాయ్. చేతలు చురకత్తుల్లా దిగుతాయ్. అందుకే సైతం కొండా సినిమా తీశారు. మొదటి నుంచి కాంగ్రెస్ రక్తమే. ఆ తర్వాత వైఎస్ కుటుంబానికి వీర విధేయులు. మధ్యలో కారెక్కినా.. మళ్లీ కాంగ్రెస్‌లో బలమైన నేతలుగా ఉన్నారు. వాళ్ల రాజకీయం వేరే లెవెల్. ప్రోటోకాల్స్, పద్ధతులు గట్రా ఉండవు. తమకు నచ్చింది నచ్చినట్టు చేసుకుపోవడమే. నోటికి వచ్చినట్టు మాట్లాడటమే. అందుకే, మంత్రి కొండా సురేఖ చేసిన పలు కామెంట్స్ ఇటీవల కాలంలో తీవ్ర కలకలం రేపాయి. లేటెస్ట్‌గా కొండా మురళీ మాట్లాడిన మాటలు.. కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది.

కాంట్రవర్సీ కొండా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా దంపతులదే హవా. కొత్తగా వాళ్ల కూతురు సుస్మితా పటేల్ సైతం రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. జిల్లా మొత్తం తమదే అంటారు. అన్ని నియోజకవర్గాల్లో వేలు పెడుతుంటారు. మిగతా నేతలతో అంతగా కలవరు. గొడవలూ చాలానే ఉన్నాయి. మేము మోనార్క్. అదే కొండా స్టైల్. ఇలా వారిపై రకరకాల ఆరోపణలు ఉన్నాయి. కొండా కుటుంబంలో ముగ్గురికి మూడు ఎమ్మెల్యే టికెట్లు కావాలంటారు. గత ఎన్నికల్లో ఆ డీల్ కుదరకపోవడంతో వరంగల్ తూర్పులోనే పోటీ చేసి గెలిచారు సురేఖ. వచ్చే ఎన్నికల్లోనైనా పరకాల నియోజకవర్గంలో కూతురు సుస్మితా పటేల్‌ను బరిలో దించాలనేది వాళ్ల టార్గెట్. అందుకే, సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో గిల్లికజ్జాలు పెరిగాయి.

అందరికీ ఒకేసారి ఇచ్చిపడేశారు..

రేవూరిని 75 ఏళ్ల ముసలోడు అంటూ కొండా మురళి బహిరంగంగా కామెంట్స్ చేయడం కాంట్రవర్సీగా మారింది. మరో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కనుబొమ్మలు లేనోడని.. వర్ధన్నపేట ఎమ్మెల్యే, మాజీ పోలీస్ ఆఫీసర్ నాగరాజును ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ అని.. వాళ్లంతా దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలంటూ.. సొంత పార్టీ నేతలపైనే తీవ్ర విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీని షేక్ చేసింది. సురేఖ మంత్రి పదవికి ఢోకా లేదని.. తాము ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోవడం లేదని.. తానే సురేఖకు నెలకు రూ.5 లక్షలు పంపిస్తున్నానంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ కూడా చేశారు. తనకు రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీలే అండా దండా అని చెప్పారు.

కొండా తగ్గేదేలే.. వాళ్లు వదిలేదేలే..

కొండా దెబ్బకు.. ఆయన వ్యతిరేక వర్గమంతా ఏకమయ్యారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నాయకత్వంలో భవిష్యత్ కార్యచరణ రెడీ చేశారు. కొండాకు యాంటీగా ఉన్న లీడర్స్ అంతా మీటింగ్‌కు రావడం ఆసక్తికరం. నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, నాగరాజు, బస్వరాజు సారయ్య, గుండు సుధారాణి, ఎర్రబెల్లి స్వర్ణ.. ఇలా బాధితులంతా కలిసి చర్చించుకున్నారు. ఈసారి కొండాను వదిలేదేలేదంటూ తాడోపేడో తేల్చుకునేందుకు సై అన్నారు. కొండా జంట.. జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో వర్గాలను పెంచి పోషించి చిచ్చు పెడుతున్నారని వారంతా కాంగ్రెస్‌లో అంతేనా?కొండా మురళి వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయంటూ.. ఇరు వర్గాల నుంచి కంప్లైంట్స్ వచ్చాయని చెప్పారు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్. ఫిర్యాదులు పరిశీలించిన తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అయితే, కాంగ్రెస్‌లో ఇలాంటివన్నీ కామన్. కొండా లాంటి బలమైన నాయకుడిపై అంత ఈజీగా చర్యలు తీసుకునే అవకాశం లేదని అంటున్నారు పార్టీ శ్రేణులు.

# ఏడాది ప్రొగ్రెస్ కార్డు ఇదే..

అమరావతి,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన వన్ ఇయర్ జర్నీపై ప్రజలకు ప్రొగ్రెస్ కార్డు సమర్పించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో తమ ప్రభుత్వం ఏం చేసిందో అందులో పూర్తిగా వివరించారు. వచ్చే నాలుగేళ్లలో ఏం చేస్తామో కూడా చెప్పారు. సాధారణంగా ఇలాంటి నివేదికలను సీఎం చంద్రబాబు విడుదల చేస్తుంటారు. కానీ, డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబును అనుసరిస్తూ ప్రజలకు తన పనితీరుపై నివేదిక సమర్పించారు.గత ఐదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాదిలోనే చేసి చూపించామని డిప్యూటీ సీఎం పవన్ స్పష్టం చేశారు. ప్రజల్లోనూ పెట్టుబడిదారుల్లోనూ విశ్వాసం నింపడానికి కృషి చేశామని తెలిపారు. రాష్ట్రంలో సుపరిపాలన, అభివృద్ధి పథకాలకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని వెల్లడించారు. స్వర్ణాంధ్ర-2047 సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని, బాధ్యతలు స్వీకరించిన ఏడాది పూర్తయిన సందర్భంగా 20 పేజీల నివేదిక విడుదల చేస్తున్నామని తెలిపారు."ప్రగతి, పారదర్శకత, సుస్థిరత, జవాబుదారీతనం, గ్రామ స్వరాజ్యానికి ముందడుగు.. హరితాంధ్ర సాధనకై మరో అడుగు" అంటూ ప్రజలకు నివేదిక సమర్పించారు పవన్. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమికి అండగా నిలబడి బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయాల్లో, ప్రభుత్వంలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, నిరంతరం పరితపించే తాను చేపట్టిన శాఖల ద్వారా ఏడాదిలో సాధించిన విజయాలను ప్రజల ముందు ఉంచడం నైతిక బాధ్యతగా భావిస్తున్నానని పవన్ తెలిపారు.ఏడాదిలో తన శాఖ పరిధిలో 1,312 కిలోమీటర్ల మేర 449 బీటీ



రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. రూ.649 కోట్లు వెచ్చించామని వెల్లడించారు. అదేవిధంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ.589 కోట్లు కేటాయించారని తెలపారు. గిరిజన ప్రాంతాలకు రోడ్ల నిర్మాణంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ రోడ్లకు మరమ్మతులు చేపట్టమని తెలిపారు. ఉపాధి నిధులతో 4 వేల కిలోమీటర్ల సిమెంటు రోడ్ల నిర్మాణం, గ్రామాలను కలిపేలా 276 కి.మీ. బీటీ రోడ్ల నిర్మాణం, 78 వేల నీటి కుంటలు, 22,500 గోకులాల షెడ్ల నిర్మాణం, 15 వేల పశువుల నీటి తొట్టెల నిర్మాణం చేపట్టారు. 1877 నివాస ప్రాంతాలకు తొలిసారిగా రహదారి సౌకర్యం కల్పించారు. 1137 గిరిజన గ్రామాలకు రహదారి సమస్యలను పరిష్కరించారు. ఆయా గ్రామాలకు డోలీ మోతల బాధలు తప్పించారు. ఇక తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో రూ.308 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు.

# మోడీ దత్త పుత్రుడు జగన్..



అమరావతి,మాజీ సీఎం జగన్మోహనరెడ్డి ప్రధాని మోడీ దత్తపుత్రుడు.. బీజేపీ మద్దతుతో జగన్ ఎన్నో అరచకాలకు పాల్పడుతున్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. జగన్ కు బీజేపీ అన్ని విధాలుగా సహకరిస్తోందని షర్మిల ఆరోపించారు. అందుకే ఆయన ఏమి చేసినా చెల్లుతోందని వ్యాఖ్యానించారు. తన బాబాయ్ వివేకా హత్యతోపాటు అనేక విషయాల్లో జగన్ కు బీజేపీ అండగా నిలుస్తోందని ధ్వజమెత్తారు షర్మిల.మాజీ సీఎం జగన్ పై ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మరోసారి విరుచుకుపడ్డారు. 'రప్పా.. రప్పా.. నరుకుతాం' అనే వ్యాఖ్యలను జగన్ సమర్థించడంపై షర్మిల విస్మయం వ్యక్తం చేశారు. ఓ పార్టీ అధినేతగా ఉన్న నాయకుడు అలా మాట్లాడటం సమంజమేనా? అంటూ ప్రశ్నించారు. జగన్ సమాజానికి ఎలాంటి సమాధానం ఇవ్వాలనుకుంటున్నారని నిలదీశారు.'మేము నరికేస్తాం.. మేము చంపేస్తాం.. మేం బట్టలూడదీస్తాం.. మేం వెంటపడి కొడతాం' వంటివి ఒక నాయకుడిగా మాట్లాడాల్సిన మాటలు కావంటూ షర్మిల వ్యాఖ్యానించారు. జగన్ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందని షర్మిల తెలిపారు. రెండు రోజుల క్రితం మాజీ సీఎం జగన్ పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో పర్యటించిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కొందరు వైసీపీ కార్యకర్తలు 'రప్పా.. రప్పా.. నరుకుతాం' అనే వివాదాస్పద వ్యాఖ్యలను ప్రదర్శించారు. దీనిపై నిన్న మీడియాతో మాట్లాడిన జగన్ ఈ ప్రభుత్వంలో సినిమా డైలాగ్ చెప్పడం కూడా తప్పేనా? అంటూ వ్యాఖ్యానించారు.దీంతో రెండు రోజులుగా రాష్ట్ర రాజకీయాల్లో 'రప్పా.. రప్పా.. నరకడం' అన్న వ్యాఖ్యపైనే హాట్ డిబేట్ నడుస్తోంది. అధికార పార్టీ ఈ వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతోంది. కానీ, వైసీపీ అధినేత జగన్ మాత్రం ఆ వ్యాఖ్యలను సినిమా డైలాగుగానే చూడాలని సూచించారు. అయితే ఈ రోజు డిప్యూటీ సీఎం పవన్ తోపాటు కాంగ్రెస్ చీఫ్ షర్మిల సైతం జగన్ వ్యాఖ్యలను తప్పుపడుతూ ప్రకటనలు చేశారు.

# కాళేశ్వరం దండగమారి ప్రాజెక్ట్

హైదరాబాద్, కాళేశ్వరం ప్రాజెక్టు దండగమారి ప్రాజెక్ట్ అని, దానిపై అనవసరంగా నిధులు వృధా చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని, ఇంకా నష్టాలను ప్రజలపై రుద్దవద్దన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు తీసేసి.. వాటిలోని పైపులను వాడుకోవాలని సూచించారు. ఆ మూడు బ్యారేజీల మరమ్మతులకు రూ.20వేల కోట్లు ఖర్చు అవుతోందని, అంత ఖర్చు పెట్టినా వరద ఉధృతి వల్ల బ్యారేజీలు కొట్టుకుపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. ఆ మూడు ప్రాజెక్టులకు పెట్టే ఖర్చుకు బదులు ప్రాణహిత పూర్తి చేస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. 3 ప్రాజెక్టులు తీసేయడం వల్ల కేవలం రూ.10వేల కోట్ల నష్టం వస్తుంది. వీటికి మరమ్మతులు చేసే బదులు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో గోదావరిపై 14 చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు.



కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృథా అని నేను చెప్పలేదు. కేవలం ఆ మూడు బ్యారేజీలపై మాత్రమే మా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం.

# 74 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఊస్టింగ్!



హైదరాబాద్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై కక్ష కట్టినట్టు వ్యవహరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం సచివాలయంలోని మరో 74 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నది. ఇప్పటికే తెలంగాణ సచివాలయంలో గత రెండు నెలలుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదు. చాలీ చాలనీ జీతాలతో పనిచేస్తున్న వీరిపై కన్నెర్ర చేయడం సచివాలయంలోని శాశ్వత ఉద్యోగులను సైతం ఆలోచింప చేస్తున్నది. గత పదిహేను సంవత్సరాలుగా సచివాలయంలో పనిచేస్తున్న వారిలో 74 మందిని తొలగించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయా నిర్ణయం తీసుకున్నారని సమాచారం. వీరిని ఇంటికి పంపించిన తరువాతే మిగతా వారికి వేతనాలు మంజూరు చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారని తెలిసింది. మిగులు సిబ్బంది పేరుతో వీరిని అకారణంగా తొలగిస్తున్నారని, 74 మంది తొలగింపుతో ఆదా అయ్యేది రూ.10 లక్షలు మాత్రమేనని చెబుతున్నా సందీప్ ఏమాత్రం ఖాతరు చేయడం లేదని ఉద్యోగ సంఘాల నాయకులు అంటున్నారు.

కొలువుల భర్తీ లేక..

రాష్ట్రంలో పదేళ్లు అధికారం వెలగబెట్టిన బీఆర్ఎస్.. శాశ్వత నియామకాలు చేపట్టకపోవడంతో సచివాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారు. మంత్రులు, కార్యదర్శుల విభాగాలతోపాటు వివిధ సెక్షన్లలో శాశ్వత ఉద్యోగులకు సహాయంగా ఉంటున్నారు. ఒక రకంగా చెప్పాలంటే తక్కువ జీతంతో శాశ్వత ఉద్యోగులకు సమానంగా పనిచేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం పనిచేస్తున్న వారిని కొనసాగించకుండా పొదుపు చర్యల పేరుతో తొలగింపు మొదలు పెట్టింది. పేషీలు, సెక్షన్లలో డాటా ఎంట్రీ ఆపరేటర్లుగా, ఆఫీసు బాయ్‌లుగా పనిచేస్తున్న తమపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎందుకు ఆగ్రహంగా ఉన్నారో తెలియడం లేదని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాపోతున్నారు. సాధారణంగా ప్రతి సంవత్సరం మార్చి చివరితో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కాలపరిమితి ముగుస్తుంది. మళ్లీ ఏప్రిల్ 1 నుంచి ఏడాది పాటు కొనసాగించేందుకు వీలుగా రెన్యూవల్ చేస్తారు. ఈ ఏడాది రెన్యూవల్ చేయకుండా పక్కనబెట్టడమే కాకుండా వేతనాలు కూడా పెండింగ్‌లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమంటే మిగులు సిబ్బంది ఉన్నారని, తొలగించాలని అంటున్నారు.

ఇచ్చేది కొంతే.. గొడ్డు చాకిరీ

సచివాలయంలో సుమారు 74 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో డీఈవోలు, ఆఫీసు బాయ్స్ ఉన్నారు. వీరికి ప్రతి నెలా రూ.18వేల వరకు వేతనం చెల్లిస్తున్నప్పటికీ, ఈఎస్ఐ, పీఎఫ్, ఏజెన్సీ కమీషన్ మినహాయిస్తే వారికి అందేది రూ.15వేలు మాత్రమే. ఈ రూ.15వేల కోసం ఉదయం నుంచి రాత్రి వరకు గొడ్డు చాకిరీ చేస్తున్నారు. శాశ్వత ఉద్యోగులతో పాటు, అధికారులు చెప్పే పనిని చేస్తున్నారని చెబుతున్నారు. వీరిని తొలగించవద్దని కొద్ది రోజుల క్రితం సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు వెళ్లి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానీయాను కలిసి విన్నవించారు. తక్కువ వేతనాలతో రెట్టింపు పనిచేస్తున్నారని, వారిని కొనసాగించాలని కోరారు. అయినప్పటికీ ఆయన వినిపించుకోకుండా తొలగించాలనే మొండి పట్టుదలతో ఉన్నారని అంటున్నారు. వారిని తొలగించడం మూలంగా ప్రతి రూ.10 లక్షల దాకా ఆదా అవుతుందని, ఈ సొమ్ముతో ప్రాజెక్టులు కడతారా? అని ప్రశ్నించినా కూడా ఆయన స్పందించడం లేదని తెలిసింది. పదిహేను సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని అకస్మాత్తుగా తొలగిస్తే, ఎక్కడకు వెళ్లాలని మొత్తుకున్నా ఆయన ససేమిరా అంటున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయంలో వీలు కానట్లయితే కనీసం హైదరాబాద్ లోని ప్రభుత్వ కార్యాలయాల్లో సర్దుబాటు చేయాలని కోరుతున్నారు.

ఆందోళనకు దిగుతాం!

సందీప్ కుమార్ సుల్తానియా వైఖరితో అగ్రహంగా ఉన్న సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు.. ప్రత్యక్ష ఆందోళనకు దిగాలనే యోచనలో ఉన్నారు. నాలుగైదు రోజుల్లో జీతాలు చెల్లిస్తే సరి లేదంటే ఆయన చాంబర్ ముందు ఆందోళనకు దిగడం ఖాయమని నాయకులు అల్టిమేటం జారీ చేశారు. శాశ్వత ఉద్యోగుల పెండింగ్ బిల్లుల విషయంలో కూడా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని సంఘం నాయకులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. తమకు స్వంత పనులు ఏమీ ఉండవని, సచివాలయంలో పనిచేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన వద్దకు వెళ్తుంటామని చెప్పారు. వాటిని కూడా పరిష్కరించేందుకు సమయం ఇవ్వకపోతే ఎలా అని ప్రధాన కార్యదర్శిని అడిగారు. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తన వైఖరిని మార్చుకుంటే మంచిదని, లేదంటే ఆయన చాంబర్ ముందు ఆందోళన చేపట్టడం ఖాయమని ప్రధాన కార్యదర్శికి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవహరించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవహరిస్తే ఒప్పుకునే ప్రసక్తి లేదని సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు అంటున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో రానున్నవన్నీ కలర్ బుక్ ప్రభుత్వాలేనా?

హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లోని రాజకీయాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గతంలో రాజకీయంగా ప్రత్యర్థులుగా మాత్రమే ఉండే రాజకీయనాయకుల మధ్య ఇప్పుడు శత్రుత్వమే కాదు.. వ్యక్తిగత కక్షల వరకు పరిస్థితులు వెళ్లిపోయాయి. అందుకు తగ్గట్లే విమర్శలు.. ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. లోకేశ్ షురూ చేసిన రెడ్ బుక్ రాజకీయం ఇప్పుడు అంతకంతకూ విస్తరిస్తోంది.లోకేశ్ నోటి నుంచి తరచూ వచ్చే రెడ్ బుక్ పాలన.. తెలుగు రాజకీయాల్లో సరికొత్త ఆయుధంగా మారింది. దీనికున్న క్రేజ్ ను పరిగణలోకి తీసుకున్న తెలంగాణ విపక్షం బీఆర్ఎస్ ముఖ్యనేతలు సైతం తాము పింక్ బుక్ రాస్తున్నట్లుగా పేర్కొంటున్నారు. మొదట్లో మాట వరసకు అన్నట్లుగా భావించినా.. రోజులు గడుస్తున్న కొద్దీ.. గులాబీ కీలక నేతల నోటి నుంచి తరచూ పింక్ బుక్ ప్రస్తావన రావటంతో.. తెలంగాణ రాజకీయాలు సైతం కలర్ బుక్ రాజకీయాల దిశగా అడుగులు పడుతున్నట్లుగా చెప్పాలి.ఇంతకూ ఈ బుక్ లో ఏముంటుంది? నిజంగానే అందులో ఏం రాసుకుంటారు? అన్న సందేహాలకు తావు లేకుండా విపక్షంలో ఉన్నప్పుడు లోకేశ్ తన వెంట రెడ్ కలర్ అట్ట ఉన్న పుస్తకాన్ని తన వెంట తీసుకొచ్చి.. సభలో మాట్లాడుతున్నప్పుడు కూడా ఆ పుస్తకాన్ని చూపించేవారు. నిజానికి లోకేశ్ ఇమేజ్ బిల్డింగ్ కు రెడ్ బుక్ కాన్సెప్ట కలిసి వచ్చిందని చెప్పాలి. ఆయన చేసిన సుదీర్ఘ పాదయాత్ర కంటే కూడా రెడ్ బుక్ పట్టుకొని.. "ప్రత్యర్థుల సంగతి తేలుస్తా.. అందులో అన్ని రాసుకుంటున్నా.. నా పార్టీకి చెందిన వారి ఇబ్బందుల్ని నమోదు చేసుకుంటా. అంతకంతకూ బదులు తీర్చుకుంటా' అంటూ చెప్పిన మాటలు హైలెట్ అయ్యాయి.లోకేశ్ రెడ్ బుక్ ఆయనకు కొత్త ఇమేజ్ తీసుకురావటమే కాదు.. నేతలు.. కార్యకర్తల్లో నమ్మకాన్ని పెంచేలా చేయటం మిగిలిన పార్టీలకు స్ఫూర్తిగా మారింది. అధికారం చేతిలో లేనప్పుడు అధికార పార్టీ తమను పెట్టే ఇబ్బందుల్ని మర్చిపోకుండా



అన్ని రాసుకుంటున్నా.. గుర్తు పెట్టుకుంటున్నానన్న సందేశాన్ని క్యాడర్ కు.. కార్యకర్తలకు ఇవ్వటమే ఈ బుక్ కాన్సెప్టుగా చెప్పాలి.ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తామని.. వారి బతుకుల్ని మారుస్తామని.. డెవలప్ మెంట్ దిశగా పరుగులు తీయిస్తామని.. ఉపాధి అవకాశాల్ని భారీగా పెంచేస్తామని.. రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేసి.. ప్రజల మీద పన్నుపోటు లేకుండా చూస్తామన్న రాజకీయానికి బదులుగా.. ఎంతసేపటికి మీరు నన్ను..పార్టీ నేతలు.. కార్యకర్తల్ని ఆ మాట అన్నారు. ఈ మాట అన్నారు. ఆ చర్య చేపట్టారు. ఈ పని చేశారు. ఇంతకింతా మీకు తిప్పలు తప్పవన్న హెచ్చరికలు రానున్న రోజుల్లో తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలు మరింత దూకుడుగా చేపడతాయని చెప్పాలి.ఇదంతా చూస్తే.. ఇప్పటికి మించి రానున్న రోజుల్లో మరింత ఎక్కువగా ఏ పార్టీకి ఆ పార్టీ తమదైన ఒక బుక్ ను తమ రాజకీయ ప్రత్యర్థుల కోసం సిద్ధం చేసుకుంటుందని చెప్పాలి. అదే జరిగితే.. తెలుగు రాష్ట్రాల రాజకీయాలు ప్రజల బాగు కోసం కంటే.. బదులు తీర్చుకోవటంపైనే ఎక్కువ ఫోకస్ చేయటం ఖాయం.

# చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి చర్చలు!



ఏపీతో ఎలాంటి వివాదాలు తాను కోరుకోవడం లేదని.. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి భేషజాలు లేవని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తామని చెప్పారు. గోదావరి జలాలపై రెండు రాష్ట్రాలు కూర్చుని మాట్లాడుకుంటే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఫ్లడ్ వాటర్ తరలిస్తే బాగుంటుందని సూచించారు. గోదావరి, కృష్ణా నీటిని తరలించాలనే నిర్ణయమే మేజర్ సమస్య అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై ఈ నెల 23న జరిగే కేబినెట్ మీటింగ్‌లో చర్చిస్తామని చెప్పారు. కర్ణాటకతో ఎలాంటి సంబంధాలు ఉన్నాయో.. ఏపీతోనూ అలాంటి రిలేషనే కొనసాగుతుందని తెలిపారు.

బీఆర్ఎస్ చచ్చిపోయింది..

మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర కామెంట్స్ చేశారు. రాష్ట్రం విడిపోకముందు, విడిపోయిన తర్వాత కూడా సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఇన్నాళ్లూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారని.. బీఆర్ఎస్ రాజకీయంగా చచ్చిపోయిందని స్పష్టం చేశారు. జలాల పేరుతో ఇప్పుడు మళ్లీ పునరుజ్జీవనం కోసం ట్రై చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు ఫిజిబిలిటీ రిపోర్టును కేంద్రానికి ఇవ్వటం వల్ల ఈ వివాదం మొదలైందన్నారు. తెలంగాణతో ముందే చర్చించి ఉంటే సమస్య ఇంత వరకూ వచ్చేది కాదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు కేంద్రం దగ్గరకు వెళ్లి మాట్లాడటం వల్ల.. కేసీఆర్‌కు విమర్శించే అవకాశం ఇచ్చినట్లు అవుతుందన్నారు.

అంతా కేసీఆరే చేశారు..

గోదావరి వరద జలాలను తరలించడానికి బీజం వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు రేవంత్ రెడ్డి. అపెక్స్ కౌన్సిల్లో కేసీఆర్ ఎందుకు ఆమోదం తెలిపారని ప్రశ్నించారు. కేసీఆర్ ఆమోదం తెలిపాక చంద్రబాబు గోదావరి జలాలను తరలించారని.. చచ్చిపోయిన పార్టీని బతికించుకోవడానికి బీఆర్ఎస్ అబద్ధాలు మాట్లాడుతుందన్నారు రేవంత్. బీఆర్ఎస్ చెప్పిన అబద్ధాలు దేవుడు కూడా నమ్మే పరిస్థితి లేదన్నారు.

కిషన్‌రెడ్డికి ట్యూషన్ మాస్టార్ ఎవరంటే..

కిషన్ రెడ్డిపై కూడా కీలక వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. తాను ఢిల్లీకి రాకముందే కిషన్ రెడ్డి కేంద్ర పెద్దలను కలిశారని చెప్పారు. కిషన్ రెడ్డికి కేటీఆర్ ట్యూషన్ మాస్టార్ అయితే.. కేసీఆర్ లైజనింగ్ ఆఫీసర్ అని అన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com